


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 273 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 24 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


## ఉద్యోగులపై వరాల జల్లు..

# భారీ పెట్టుబడులకు ఆమోదం

- ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు.. రూ.39,355 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- రాష్ట్రంలో 34,610 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్
- అమరావతి పనుల వేగవంతం.. మౌలిక వసతులకు టెండర్లకు ఆమోదం
- కొందరు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం.. పీఎస్‌యూల్లో రిటైర్మెంట్ వయసు 62కి పెంపు
- మచిలీపట్నం, రామయ్యపట్నం పోర్టుల పరిధుల క్రమబద్ధీకరణ, పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ సమావేశం, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడం, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, పర్యాటక రంగం అభివృద్ధి వంటి అంశాలపై క్యాబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశానంతరం తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు.



**భారీగా పారిశ్రామిక పెట్టుబడులు**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ సిఫారసు చేసిన పలు ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. మొత్తం రూ.39,355 కోట్ల పెట్టుబడులతో, 34,610 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఇందులో భాగంగా ఏర్పాటు చేయనున్న కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు:**

ప్రీమియర్ ఎనర్జీస్ (తిరుపతి): రూ.3,936 కోట్ల పెట్టుబడితో మిగతా .. 2లో..

పవన్‌ను వివాదాల్లోకి లాగితే

## మంత్రులంతా స్పందించాలి

సీఎం నారా చంద్రబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** నేరగాళ్లను వెనకేసుకొస్తూ వైకాపా రాజకీయం చేస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టే ఆ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని మంత్రులకు ఆయన సూచించారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. కర్నూలులో జరిగిన ఘటనను సీఎం ప్రస్తావించారు. ఊరంతా బహిష్కరించిన వారిని వైకాపా వెనకేసుకొచ్చిందని గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను వివాదాల్లోకి లాగితే మంత్రులంతా స్పందించాలని సీఎం సూచించారు. "మంత్రులు అన్ని శాఖలపైనా అవగాహన పెంచుకోవాలి. తన శాఖ పరిధి కాదని కూర్చోకుండా ప్రతి అంశంపై స్పందించాలి. డీఎస్సీ, వివిధ అంశాలపై వైకాపా చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. జొన్నగిరి గ్రామాన్ని స్వర్ణ గ్రామంగా నామకరణం చేద్దాం. జులై 3న కడప స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన జరుగుతుంది" అని మిగతా .. 2లో..

## రాష్ట్రపతితో ప్రధాని భేటీ

కేబినెట్ పునర్వ్యవస్థీకరణ కోసమేనా?




**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం సాయంత్రం సమావేశం జరిగింది. కేంద్ర మంత్రివర్గం పునర్వ్యస్థీకరణ ఊహాగానాల వేళ ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశం ఫొటోలను రాష్ట్రపతి కార్యాలయం 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది. కేరళకు చెందిన భాజపా నేత జార్జ్ కురియన్ కేంద్ర సహాయ మంత్రి పదవికి ఈ ఉదయం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ పరిణామంతో కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ తథ్యమన్న ఊహాగానాలు మొదలయ్యాయి. దీనికితోడు ఇటీవల పలువురు కేంద్రమంత్రులకు వారి వారి రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించడం దీనికి మరింత బలం చేకూరింది. కేంద్ర రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాను ఢిల్లీ భాజపా అధ్యక్షుడిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మే నెలలో మిగతా .. 2లో..

సాక్ష్యాలే మాయమవుతుంటే

## నిజం ఎలా బయటపడుతుంది?

వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా



**విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజీ మాయం కావడం సాయికృష్ణ అదృశ్యం కేసును మరింత సంచలనాత్మకం చేసింది. వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా ఈ అంశంపై తీవ్ర ఆరోపణలు చేశారు. "సాయికృష్ణ మిగతా .. 2లో..

ఆరు ఆలయాల అభివృద్ధికి

## శ్రీవాణి ట్రస్ట్ నిధులు

ఏపీ ప్రభుత్వం అనుమతి

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తితిదే బోర్డు, శ్రీవాణి ట్రస్ట్ తీర్మానాల మేరకు ఆరు దేవాలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సికింద్రాబాద్ (శ్రీగిరి)లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.50లక్షలు, ధర్మవరం (సిద్ధయ్యగుట్ట)లోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి రూ.50.85 లక్షలు, సిద్దిపేట జిల్లా దొమ్మాట లోని శ్రీమహాకాళేశ్వర ఆలయానికి రూ.4.60 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అనకాపల్లి జిల్లా మునగపాకలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయానికి రూ.1.75కోట్లు, సంగారెడ్డి జిల్లాలోని కించన్‌పల్లిలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.1.09కోట్లు, కర్నూలు జిల్లా హుస్సేనాపురంలోని శ్రీసుంకులమ్మ, మారెమ్మ దేవాలయానికి రూ.1.10కోట్ల నిధులు కేటాయించేందుకు అనుమతించింది.

హర్మూజ్‌లో.. ఒక్కరోజే 1.9కోట్ల


## బ్యారెళ్ల చమురు రవాణా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందంతో హర్మూజ్ జలసంధిలో నౌకాయానం తిరిగి ఊపిరి పీల్చుకుంటోంది. తాజా పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. నిన్న ఒక్కరోజే 1.9 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు రవాణా జరిగిందని, ఇది ఆల్‌టైమ్ రికార్డు అని పేర్కొన్నారు. చమురు ధరలు పడిపోతున్నాయని.. ప్రపంచం సురక్షితమైన ప్రదేశంగా మారిందంటూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు చేశారు. ఇక ఇరాన్‌తో ఒప్పందం గురించి ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఆ దేశం అంగీకరించిందన్నారు. "నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేసినప్పటికీ.. భవిష్యత్తులో అత్యున్నత స్థాయిలో అణు తనిఖీలకు మిగతా .. 2లో..

గాదె సాయికృష్ణ కేసులో కీలక పరిణామం

## కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు



నాగరాజును అదుపులోకి తీసుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం

సీఐ అరెస్టును అడ్డుకునేందుకు మద్దతుదారుల ప్రయత్నం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ (25) అదృశ్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), సస్పెన్షన్‌కు గురైన కృష్ణలంక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్‌వీవీ నాగరాజును అదుపులోకి తీసుకుంది. గత మే 9న కృష్ణలంక పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారని, ఆ తర్వాత అతను కనిపించకుండా పోయాడని బాధితుడి తల్లి విజయలక్ష్మి ఆరోపించారు. పోలీసులు తన కుమారుడిని చిత్రహింసలకు గురిచేసి చంపేసి, మృతదేహాన్ని మాయం చేశారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, సీఐ నాగరాజును సస్పెండ్ చేయడంతో పాటు సమగ్ర విచారణ కోసం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో, సీఐ నాగరాజుపై హత్య, అక్రమ నిర్బంధం వంటి అభియోగాలతో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం సిట్ అధికారులు విజయవాడ మిగతా .. 2లో..

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో

## పాల్గొన్న మంత్రి నారా లోకేష్

ఉండవల్లి నివాసంలో బూత్ లెవల్ అధికారికి తన వివరాల సమర్పణ

ఏపీలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

**ఉండవల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్, ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా తన ఓటు వివరాలను బూత్ స్థాయి అధికారికి (బీఎల్ఓ) అందజేశారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసానికి వచ్చిన బీఎల్ఓకు ఆయన అవసరమైన పత్రాలను, సమాచారాన్ని సమర్పించారు. భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన "ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026" కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా లోకేశ్ పిలుపునిచ్చారు.



పారదర్శకమైన, కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రజలందరూ సహకరించాలని, తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని ఆయన మిగతా .. 2లో..

అది కాపు ఆత్మీయ సభ కాదు..

## రాజకీయ నిరుద్యోగుల ఆర్తనాద సభ

వైసీపీపై టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ విమర్శలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల వైసీపీ నిర్వహించిన కాపుల సమావేశాన్ని టార్గెట్ చేస్తూ టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్ బాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అది కాపుల ఆత్మీయ సభ కాదని.. కేవలం పొలిటికల్ మైలేజ్ కోసం రాజకీయ నిరుద్యోగులు పెట్టుకున్న 'ఆర్తనాద సభ' అని ఎద్దేవా చేశారు. విజయవాడ సాయికృష్ణ కేసుతో పాటు ఇటీవల జరుగుతున్న పరిణామాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను వైసీపీ నేతలు కావాలనే వక్రీకరిస్తున్నారని సానా సతీశ్ మండిపడ్డారు. "నేరం చేసిన ఏ నేరస్థుడికైనా కులం రంగు పులమొద్దని, చట్టప్రకారం చర్యలు ఉంటాయని పవన్ కల్యాణ్ చాలా స్పష్టంగా చెప్పారు. కానీ ఆ మాటలను మార్చేసి జగన్ అండ్ కో ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతూ మిగతా .. 2లో..

నాన్న వెంటిలేటర్‌పై ఉన్నారు..

## జగన్‌కు పట్టదా?

ముద్రగడ కుమార్తె క్రాంతి ఆవేదన



**విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర గందరగోళం నెలకొంది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు, కుమార్తె క్రాంతి పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తుండటంతో ఆయన అభిమానులు, అనుచరుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు ఆయన కోలుకుంటున్నారని, వదంతులు నమ్మవద్దని కుటుంబ సభ్యులు చెబుతుండగా, మరోవైపు తన తండ్రి వెంటిలేటర్‌పై ప్రాణాలతో పోరాడుతున్నారని కుమార్తె క్రాంతి సంచలన వ్యాఖ్యలు చేశారు.

**జగన్ తీరుపై క్రాంతి తీవ్ర అసహనం**

తన తండ్రి ఆరోగ్యంపై స్పందించిన క్రాంతి, మిగతా .. 2లో..

## మల్లారెడ్డి నివాసాల్లో ఏసీబీ సోదాలు

8 ప్లాట్లు, 10 ఎకరాల భూమి గుర్తింపు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్ముర్రి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేసింది. అక్రమాలకు పాల్పడి ఆస్తులు సంపాదించినట్లు మల్లారెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని మచ్చబొల్లారం, నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లోని మల్లారెడ్డి నివాసాలతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ తనిఖీల్లో మల్లారెడ్డికి చెందిన పలు ఆస్తులను గుర్తించారు. 4 ఇళ్లు, ఒక వాణిజ్య భవనం, 8 ఖాళీ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. ఆయన వద్ద సుమారు రూ.3.31 లక్షల నగదు, రూ.50లక్షల బ్యాంకు నిల్వలు, మిగతా .. 2లో..

మీ తప్పులను కవర్ చేసుకోవడానికి

## భారత్‌పై నిందలా?



పాక్‌కు స్ట్రాంగ్ కౌంటర్

**విశ్వం వాయిస్ న్యూస్ :** పీఓకేలో ఆందోళనలతో పాటు సింధూ జలాల ఒప్పందానికి సంబంధించి పాక్ మంత్రి చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ దేశం ఇలాంటి నీచ ప్రయత్నాలకు పాల్పడుతోందని మండిపడింది. ఆ మంత్రి చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమేనని తేల్చి చెప్పింది. అసలేం జరిగిందటే.. ఇటీవల పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మిగతా .. 2లో..


హర్మూజ్‌ను దాటి..

## భారత్ వైపు 11 నౌకలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్‌లు శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత హర్మూజ్ జలసంధిలో పరిస్థితులు మెరుగుపడుతున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలో భారత్ జెండాలున్న 11 నౌకలు హర్మూజ్‌ను దాటినట్లు భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. పశ్చిమాసియాలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని, మిగతా .. 2లో..

## మమ్ముట్టికి పద్మభూషణ్

మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌కు పద్మశ్రీ ప్రదానం



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 'పద్మ' అవార్డుల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం సాయంత్రం ఈ అవార్డులను ప్రదానం చేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## రాష్ట్రపతితో ప్రధాని భేటీ

నియమించారు. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో మరింత మంది మంత్రులకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. దీంతో రాబోయే రోజుల్లో మరికొంతమంది తమ మంత్రి పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అదే సమయంలో కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న ప్రచారమూ జరుగుతోంది. వివిధ పార్టీల నుంచి భాజపాలోకి, ఎన్డీయేలోకి వచ్చిన వారిని కేబినెట్‌లోకి తీసుకుంటారని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ రాష్ట్రపతి భేటీ కావడంతో త్వరలోనే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉండొచ్చన్న సంకేతాలు ఇచ్చినట్లయ్యింది.

## నిజం ఎలా బయటపడుతుంది?

అదృశ్యంపై మొదటి నుంచి అనేక అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు కీలక సాక్ష్యాలైన సీసీటీవీ ఫుటేజీ మాయం కావడం ఆందోళన కలిగిస్తోంది" అని అన్నారు. సాక్ష్యాలను భద్రపరచాల్సిన పోలీసులే వాటిని కాపాడలేకపోతే ప్రజలు ఎవరిని నమ్మాలి? సీసీటీవీ ఫుటేజీ మాయం కావడంపై ఎందుకు క్రిమినల్ కేసు నమోదు చేయడం లేదు? ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదు? అని రోజా ప్రశ్నించారు. మరోవైపు, సాయికృష్ణను పోలీసులు చిత్రహింసలకు గురిచేసి లాకప్ డెత్ చేశారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సీఐ నాగరాజును సస్పెండ్ చేసి సిట్ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో, సీఐను సిట్ కార్యాలయానికి తరలిస్తుండగా అతని మద్దతుదారులు ఆందోళన చేపట్టి అడ్డుకోవడానికి ప్రయత్నించారు. సాయికృష్ణ కేసు గత వారం రోజులుగా ఏపీలో హాట్ టాపిక్‌గా మారింది.

### బ్యారెళ్ల చమురు రవాణా

ఇరాన్ అంగీకరించింది. అణు నిజాయతీకి ఇది ధీమా కల్పిస్తోంది. ఇందుకు వాళ్లు కట్టుబడి లేకుంటే తదుపరి చర్చలు ఉండవు. దీనితోపాటు ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ఆధారంగా ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మూజ్‌ను తెరిచి ఉంచేందుకు నేను అంగీకరించాను. దిగ్బంధనాన్ని తిరిగి ప్రారంభిస్తే నౌకలు ప్రస్తుతం ఉన్నచోటే నిలిచిపోతాయి. కానీ, ప్రస్తుతానికి అలా జరగడం అసాధ్యంగా కనిపిస్తోంది. అమెరికా విడుదల చేసే నిధులతో ఆహారం, వైద్య సామగ్రి వంటి వాటిని మాత్రమే వాళ్లు కొనుగోలు చేయగలరు. అంతేకాదు, వాటిని పూర్తిగా అమెరికా నుంచే కొనాల్సి ఉంటుంది. ఇరాన్‌కు ఇప్పుడివి ఎంతో అవసరమని భావిస్తున్నా. సంప్రదింపులు జరుగుతున్నాయి" అని ట్రంప్ పేర్కొన్నారు.

### కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు

సింగ్ నగర్‌లోని నాగరాజు నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, నాగరాజును విచారణ నిమిత్తం సిట్ కార్యాలయానికి తరలించారు. అక్కడ సుమారు ఐదు గంటల పాటు సుదీర్ఘంగా విచారించిన అనంతరం ఆయనను అరెస్టు చేశారు. నాగరాజు అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని సిట్ అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

## పాల్గొన్న మంత్రి నారా లోకేష్

విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గ శాసనసభ్యుడిగా లోకేశ్ స్వయంగా ఈ ప్రక్రియలో పాల్గొని ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అధికారులు ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లను తొలగించడంతో పాటు, అర్హులైన నూతన ఓటర్ల నమోదును చేపడుతున్నారు. అభ్యంతరాలు పరిశీలన అనంతరం జులై 21న ముసాయిదా జాబితాను, సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు.

## రాజకీయ నిరుద్యోగుల ఆర్తనాద సభ

సమాజంలో కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు కాపులకు 5 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పిస్తే.. జగన్ అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేశారని గుర్తుచేశారు. "అసలు కాపులపై జగన్‌కు నిజమైన ప్రేమ ఉందా? గతంలో కాకినాడ నడిబొడ్డున నిలబడి.. 'కాపులకు రిజర్వేషన్లు ఇవ్వడం నా చేతుల్లో లేదు, నేను ఇవ్వలేను' అని జగన్ బాహాటంగా చెప్పలేదా? ఇప్పుడు కాపుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది" అని ఎద్దేవా చేశారు. ప్రతి చిన్న విషయాన్ని జగన్ అండ్ కో రాజకీయం చేస్తోందని, చివరకు ఎవరైనా చనిపోతే శవం వద్దకు వెళ్లి కూడా అది ఏ కులమని అడిగి మరీ రాజకీయ లాభం కోసం చూస్తారని సానా సతీశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## జగన్‌కు పట్టదా?

వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "వైసీపీలో రౌడీలకు, గంజాయి బ్యాచ్‌లకు ఇచ్చిన విలువ.. జగన్ కోసం తన పేరును సైతం మార్చుకున్న నా తండ్రికి ఇవ్వకపోవడం చాలా బాధాకరం. గత 10 రోజులుగా నాన్న వెంటిలేటర్‌పై ప్రాణాలతో పోరాడుతుంటే, కనీసం పరామర్శించడానికి కూడా జగన్‌కు తీరిక లేదా?" అంటూ ఆమె ప్రశ్నించారు. "మీ అవసరం ఉన్నంతవరకే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మీకు గుర్తుంటారా? పని అయిపోయిన తర్వాత మా నాన్న గారికి మీరు ఇచ్చే విలువ ఇదేనా?" అని నిలదీశారు.

**కుటుంబంలో విభేదాలు.. భిన్న వాదనలు**

ముద్రగడ ఆరోగ్య పరిస్థితిపై ఆయన కుటుంబ సభ్యులు చేస్తున్న ప్రకటనకు, కుమార్తె క్రాంతి చెబుతున్న విషయాలకు పొంతన కుదరడం లేదు. ముద్రగడ అస్వస్థతకు గురయ్యారని, వైద్యులు పది రోజుల పాటు విశ్రాంతి సూచించారని, ప్రస్తుతం కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే క్రాంతి మాత్రం తన తండ్రి క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, సరైన వైద్యం అందడం లేదని ఆరోపించారు. తన సోదరుడు గిరి, తండ్రిని ఎవరినీ కలవకుండా నిర్బంధించారని ఆమె విమర్శించారు. గతంలో కూడా క్రాంతి ఇలాంటి ఆరోపణలు చేసినప్పుడు ముద్రగడ పద్మనాభం స్వయంగా స్పందించారు. తనకు క్యాన్సర్ లేదని, వృద్ధాప్యం కారణంగా వచ్చిన సాధారణ ఆరోగ్య సమస్యలు మాత్రమే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు మరోసారి ఆయన ఆసుపత్రిలో చేరడం, కుటుంబ సభ్యుల మధ్య భిన్న వాదనలు వినిపిస్తుండటంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కాకినాడ జిల్లా కిర్లంపూడి నుంచి గత వారం హైదరాబాద్ వచ్చిన ముద్రగడ, నాలుగు రోజుల క్రితం అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేరినట్లు తెలుస్తోంది.

## మల్లారెడ్డి నివాసాల్లో ఏసీబీ సోదాలు

మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై 3 బ్యాంకు లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా వీటిని త్వరలో తెరవనున్నారు. సోదాల్లో గుర్తించిన మొత్తం ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.3కోట్లుగా అంచనా వేశారు. మార్కెట్ విలువ ప్రకారం అనేక రెట్లు అధికంగా ఉండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. మల్లారెడ్డిని బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

## భారత్‌పై నిందలా?

హింసాత్మక నిరసనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇటీవల పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఈ ఆందోళనల వెనుక భారత్ ప్రభావం ఉందంటూ నోరు పారేసుకున్నారు. అంతటితో ఆగకుండా.. పాకిస్థాన్ నీటి భద్రతకు ముప్పు వాటిల్లిందని భావిస్తే భారత్‌పై యుద్ధానికి కూడా వెనుకాడబోమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ మీడియా సమావేశంలో స్పందిస్తూ ఖవాజా వ్యాఖ్యలకు దీటుగా బదులిచ్చారు. "తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ఆ దేశంలో జరుగుతోన్న మానవ హక్కుల ఉల్లంఘన నుంచి ప్రపంచం దృష్టి మళ్లించేందుకు పాక్ ఇలాంటి విఫల ప్రయత్నాలు చేస్తోంది. ఈ కల్పిత ఆరోపణలను మేం తోసిపుచ్చుతున్నాం. పాకిస్థాన్ బలవంతపు ఆక్రమణలో ఉన్న ప్రాంతాలలో (పీఓకేను ఉద్దేశిస్తూ) దశాబ్దాలుగా ఆర్థిక దోపిడీ కొనసాగుతోంది. అక్కడి ప్రజలు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారు. పాలనాపరమైన అణచివేత విధానాల ఫలితంగానే ప్రస్తుతం అక్కడ నిరసనలు జరుగుతున్నాయి. ఆ ఆందోళనలపై పాక్ ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోంది. అమాయక పౌరులపై కాల్పులు చేయడంతో పాటు ఔషధ సరఫరా, ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేసింది. ఈ బలవంతపు చర్యల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దురాగతాలకు గానూ అంతర్జాతీయ సమాజం పాక్‌ను జవాబుదారీగా నిలబెడుతుందని ఆశిస్తున్నాం" అని రణ్‌ధీర్ వెల్లడించారు.

## భారత్ వైపు 11 నౌకలు

జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా చమురు దిగుమతి చేసుకుంటామన్నారు. "ఇప్పటివరకు భారత జెండాలున్న పది నౌకలు ఇంకా పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయి. అదనంగా మరో రెండు నౌకలు ఇటీవలే అక్కడకు చేరుకున్నాయి. అమెరికా-ఇరాన్ ఒప్పందం జరిగినప్పటి నుంచి 11 భారతీయ నౌకలు హర్మూజ్‌ను దాటాయి. ఒక్కోదాంట్లో 2.85లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉన్న మూడు భారత జెండాలున్న నౌకలు, విదేశీ జెండా ఉన్న ఓ ఎల్‌పీజీ నౌక, విదేశీ జెండా ఉన్న మరో ముడి చమురు ట్యాంకర్, ఆరు విదేశీ జెండాలున్న ఎరువులు సరఫరా చేస్తున్న భారీ నౌకలు ఉన్నాయి. మిగిలిన భారత జెండాలున్న నౌకలు త్వరలోనే జలసంధిని దాటుతాయని అంచనా వేస్తున్నాం" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

**ఇరాన్ చమురు కొనుగోలు..!**

ఇరాన్ నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందా? అన్న ప్రశ్నకు జయస్వాల్ బదులిస్తూ.. 140 కోట్ల పౌరులకు తక్కువ ధరలో ఇంధనం అందించడమే ప్రభుత్వ విధానమని చెప్పారు. అయితే, రష్యా చమురు కొనుగోలుపై అమెరికా విధించిన ఆంక్షల గడువు వారం క్రితం ముగియడం.. ఇరాన్ సంస్థల నుంచి కొనుగోలు చేసేందుకు భారతీయ కంపెనీలకు అవకాశం లభించినట్లయ్యిందన్నారు.

## మమ్ముట్టికి పద్మభూషణ్

సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి నేడు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులంతా స్పందించాలి

చంద్రబాబు అన్నారు. కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ వ్యవహారంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని అతడి కుటుంబసభ్యులు నమ్మారని మంత్రులు అన్నారు. ఈ అంశంలో వైకాపా రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

## భారీ పెట్టుబడులకు ఆమోదం

సిలికాన్ వేఫర్, మాడ్యూల్ తయారీ యూనిట్. 540 మందికి ఉపాధి.

కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ (అనకాపల్లి): రూ.2,788 కోట్ల పెట్టుబడితో 1000 మెగావాట్ల డేటా సెంటర్.

ప్రొటేరియల్ ఇండియా (అనకాపల్లి): రూ.2,250 కోట్ల పెట్టుబడితో నియోడిమియం ఐరన్ బోరాన్ మాగ్నెట్ తయారీ పరిశ్రమ. 530 మందికి ఉపాధి.

ఇండియా (కాకినాడ): రూ.1,900 కోట్ల పెట్టుబడితో వాడిన వంట నూనెల నుంచి విమాన ఇంధనం తయారు చేసే యూనిట్. 2,500 మందికి ఉపాధి.

ఎన్ఎస్ మాగ్నటెక్ (తిరుపతి): రూ.1,250 కోట్ల పెట్టుబడితో రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ తయారీ. 400 మందికి ఉపాధి.

ఏపీ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (ప్రకాశం): రూ.1,230 కోట్లతో స్టీల్ బెనిఫికేషన్ ప్లాంట్.

వీటితో పాటు రేర్ ఎర్త్ మెటల్స్ వెలికితీత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికంగా ఎండ్-టు-ఎండ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**అమరావతికి జవసత్వాలు**

ఐదేళ్లుగా నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది.

అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ కోసం గతంలో టాబ్ ట్రీడ్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 35,000 టన్నుల సామర్థ్యంతో కొత్త వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం.

ల్యాండ్ పూలింగ్ రైతులకు కేటాయించిన ప్లాట్లలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన టెండర్లకు ఆమోదం.

రైతుల ప్లాట్ల సరిహద్దుల వివాదాలను పరిష్కరించేందుకు అవసరమైన రెక్టిఫికేషన్ డీడ్‌లపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి మినహాయింపు.

పనుల పర్యవేక్షణ కోసం ఏపీసీఆర్‌డీఏలో 95 తాత్కాలిక పోస్టుల (డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు) మంజూరు.

ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణానికి రూ.130.38 కోట్లకు టెండర్ ఆమోదం.

**ఉద్యోగులకు శుభవార్త**

ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లపై క్యాబినెట్ సానుకూలంగా స్పందించింది. 2004కు ముందు నోటిఫికేషన్ పొంది, ఆ తర్వాత నియామకం అయిన 2003 డీఎస్సీ టీచర్లు, 10/99 గ్రూప్-1 ఉద్యోగులు సహా మొత్తం 10,715 మంది సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. షెడ్యూల్ 9, 10 పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 62 ఏళ్లు పూర్తికాని రిటైర్డ్ ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరేందుకు అవకాశం కల్పించారు.

**పోర్టులు, పర్యాటకం, ఇతర నిర్ణయాలు**

పోర్టుల అభివృద్ధి: కేంద్ర ప్రభుత్వ నూతన చట్టాలకు అనుగుణంగా మచిలీపట్నం పోర్టు పరిధిని 64 కి.మీ. నుంచి 15 కి.మీ.కు, రామయ్యపట్నం పోర్టు పరిధిని 51 కి.మీ. నుంచి 15 కి.మీ.కు కుదిస్తూ నోటిఫికేషన్ల జారీకి ఆమోదం. రామయ్యపట్నం పోర్టును డీబీఎఫ్ఓటీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ఆపరేటర్ నియామకానికి ఆర్ఎఫ్‌పీ జారీకి అనుమతి. పర్యాటకం: గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'హోమ్ స్టే', 'బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' ఏర్పాటును సులభతరం చేస్తూ పర్యాటక పాలసీకి సవరణలు. తిరుపతి మినహా రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో బార్లు, రిటైల్ మద్యం దుకాణాల ఏర్పాటుకు నూతన విధానానికి ఆమోదం.

**రవాణా శాఖ:** ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న టూరిస్ట్ బస్సులను రాష్ట్రంలోకి ఆకర్షించేందుకు, ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ వాహనాల త్రైమాసిక పన్నును ప్రతి సీటుకు రూ.4,000 నుంచి రూ.2,500కు తగ్గింపు.

**ఆరోగ్యశ్రీ:** నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నివారించేందుకు "బిల్ డిస్కౌంటింగ్ సిస్టమ్"కు ఆమోదం. దీనివల్ల ఆసుపత్రులు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకుల నుంచి తక్షణమే నిధులు పొందవచ్చు.


**పరిపాలన:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం సహా 28 జిల్లాల కలెక్టరేట్లలో పాలనను బలోపేతం చేసేందుకు అదనపు పోస్టుల క్రమబద్ధీకరణకు ఆమోదం.

**పునరుత్పాదక ఇంధనం:** కడప జిల్లాలో 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఏపీఎస్పీసీఎల్‌కు భూమి కేటాయింపు. యాగంటి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 1000 మెగావాట్ల నుంచి 1500 మెగావాట్లకు పెంచేందుకు ఆమోదం. ఈ మేరకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్న అంశాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# గూగుల్ డేటాబేస్‌లో దొరకని సత్యం: నా జీవితం ఎందుకు ఇలా ఉంది?

ఒక్కసారి ప్రశాంతంగా ఆలోచించండి. అది రాత్రి పన్నెండు గంటల సమయం. చుట్టూ గాఢమైన నిశ్శబ్దం. కానీ మీ గుండె లోతుల్లో ఏదో తెలియని అలజడి, ఒక రకమైన వెలితి, చెప్పలేని బాధ మిమ్మల్ని నిద్రపోనివ్వడం లేదు. గదిలో చీకటిని చీలుస్తూ చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ వెలుగుతోంది. ఆ ఒంటరి క్షణంలో, మీరు గూగుల్ సెర్చ్ బార్‌లో టైప్ చేశారు.నా జీవితం ఎందుకు ఇలా ఉంది?మరుక్షణమే స్క్రీన్ మీద వేలాది లింకులు ప్రత్యక్షమవుతాయి. మిమ్మల్ని ఉత్సాహపరిచే మోటివేషన్ కోట్స్, రీల్స్, యూట్యూబ్ వీడియోలు, క్లిష్టమైన మానసిక విశ్లేషణలు, ఒకదాని వెనుక ఒకటి కృత్రిమ మేధ (ఌ×) అందించే చాట్‌బాట్ సమాధానాలు అన్నీ మీ సమస్యకు తక్షణ పరిష్కారం చెప్పడానికి సిద్ధంగా ఉంటాయి. కానీ, ఆ ఫోన్ పక్కన పెట్టి కళ్ళు మూసుకునే ముందు మీ మనసుకు అనిపిస్తుంది.ఇంకా ఏదో వెలితి ఉంది. ఆ రాత్రి మీ ఆత్మ అడిగిన ఆ తీవ్రమైన ప్రశ్నకు నిజమైన సమాధానం అక్కడ దొరకలేదు.ఎందుకంటే నీ ప్రశ్నలు నీవే అడగాలి, వాటికి నీ లోపల నుంచే బదులు వెతుక్కోవాలి. ఎవ్వరో రాసిన అల్గారిథమ్ నీ జీవితానికి మార్గం చూపలేదు.ఇది కృత్రిమ మేధ విప్లవాత్మకంగా విస్తరిస్తున్న యుగం. సమాచారం మన వేలికొనలపై ఉంది. చాట్‌జిపిటి నుంచి జెమిని వరకు, ప్రతి అధునాతన అల్గారిథమ్ మీకు జీవిత సత్యాలను క్షణాల్లో డెలివరీ చేయడానికి నిరంతరం పనిచేస్తోంది. నేను కెరీర్‌లో ఏ వృత్తిని ఎంచుకోవాలి? అని అడిగితే, మార్కెట్ ట్రెండ్స్‌ని బట్టి పది అద్భుతమైన సూచనలు వస్తాయి. నా సంబంధాలు ఎందుకు విఫలమవుతున్నాయి? అని అడిగితే, ప్రపంచ ప్రసిద్ధ మనస్తత్వ శాస్త్ర సిద్ధాంతాల వివరణలు మీ ముందుంటాయి.కానీ ఒక్క ప్రాథమిక విషయాన్ని కృత్రిమ మేధ ఎప్పటికీ చెప్పలేదు అసలు మీరు నిజంగా ఏమి కావాలనుకుంటున్నారు?ఎందుకంటే ఆ ప్రశ్న కేవలం సమాచారానికి సంబంధించింది కాదు, అది మీ అస్తిత్వానికి సంబంధించింది. అది మీ అనుభవాల లోతుల్లో నిద్రపోతోంది. మీ బాల్యపు అమాయకపు కలల్లో, మీరు అనుభవించిన తొలి అపజయాల తాలూకు పాఠాల్లో, ఒంటరి రాత్రుల్లో మీరు కార్చిన కన్నీటి చుక్కల్లో ఆ ప్రశ్న దాగి ఉంది. మీ జీవిత ప్రయాణానికి సంబంధించిన ఆ అసలైన సమాధానం ఏ సర్వర్ లోనూ, ఏ డేటాబేస్ లోనూ నిక్షిప్తమై లేదు. అది కేవలం మీ అంతరాత్మలో మాత్రమే ముద్రించబడి ఉంది.తెలుగు సాహిత్యం, మన వేదాంత సారం ఎప్పుడో ఒక అద్భుతమైన మాట చెప్పింది.తనను తాను తెలుసుకొనుట అదే విద్యలో విద్య. అంటే అన్ని చదువుల కన్నా, అన్ని నైపుణ్యాల కన్నా గొప్పది నిన్ను నీవు అర్థం చేసుకోవడం. కృత్రిమ మేధ అందించే సమాధానాల వరదలో కొట్టుకుపోతున్న ఈ ఆధునిక కాలంలో, ఈ ప్రాచీన వాక్యానికి ఎంతటి ప్రాసంగికత ఉందో ఇప్పుడు మనకు స్పష్టంగా అర్థమవుతుంది.నేటి తరం యువత ఒక విచిత్రమైన, సంక్లిష్టమైన మానసిక స్థితిలో ఉన్నారు. వారి వద్ద సమాచారం కొండంత ఉంది, కానీ నిర్ణయం తీసుకునే స్పష్టత లేదు. వారి ముందు వేలాది కెరీర్ ఆప్షన్స్ ఉన్నాయి, కానీ ప్రయాణించాల్సిన సరైన దిశ లేదు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు సోషల్ మీడియాలో పది వేల రకాల కంటెంట్ ముక్కలను, ఇతరుల జీవితాల రీల్స్‌ను చూస్తూ గడిపేస్తారు. అయినా, రాత్రి పరుపుపై వాలినప్పుడు మనసు నిశ్శబ్దంగా, పూర్తిగా ఖాళీగా అనిపిస్తుంది.దీనికి ప్రధాన కారణం మనం మనల్ని మనం అన్వేషించుకోవడం పూర్తిగా మర్చిపోయాం.స్వీయ అన్వేషణ అంటే సంసారాన్ని వదిలేసి, కొండలకో, అడవులకో వెళ్ళి ముక్కు మూసుకుని ధ్యానం చేయడం కాదు. నిత్య జీవితంలో ఒక్క నిమిషం పాటు ఆ మొబైల్‌ను పక్కన పెట్టి, మీకు మీరు హృదయపూర్వకంగా ఒక ప్రశ్న వేసుకోవడం.నేను ఇప్పుడు తీసుకుంటున్న ఈ నిర్ణయం నా అంతరాత్మ నుండి వస్తోందా, లేదా సమాజం ఏమనుకుంటుందో అనే భయం నుండి వస్తోందా? ఈ చిన్న ప్రశ్నతోనే స్వీయ అన్వేషణ ప్రారంభమవుతుంది.కానీ, ఈ తరం ఈ ఒక్క చిన్న ప్రశ్న వేసుకోవడానికి తీవ్రంగా భయపడుతోంది. ఎందుకంటే ఆ ప్రశ్న వేసుకుంటే వచ్చే సమాధానం మనకు నచ్చకపోవచ్చు. ఆ సమాధానం మన కంఫర్ట్ జోన్ నుండి బయటకు వచ్చి, మనల్ని మనం మార్చుకోమని గట్టిగా హెచ్చరించవచ్చు. అందుకే ఆ నిజాన్ని ఎదుర్కోలేక, భయాన్ని కప్పిపుచ్చుకోవడానికి మనం తిరిగి గూగుల్ వైపు, సోషల్ మీడియా వైపు చేతులు చాస్తాం ఎవరైనా ఒకరు మనకు నచ్చిన, తేలికైన అబద్ధపు సమాధానాన్ని చెబితే బాగుండు అని ఆశిస్తాం.కృత్రిమ మేధను తక్కువ చేయడం లేదా సాంకేతికతను వ్యతిరేకించడం ఈ వ్యాసం ఉద్దేశం కాదు. చాట్‌జిపిటి వైద్య రంగంలో పరిశోధనలకు అద్భుతంగా సహాయపడుతుంది. జెమిని విద్యార్థుల విజ్ఞాన విస్తరణకు ఉపయోగపడుతుంది. క్లాడ్ వంటి నమూనాలు సృజనాత్మకతకు కొత్త రెక్కలు తొడుగుతాయి. ఇవన్నీ మానవ మేధస్సును, జ్ఞానాన్ని వేగవంతం చేసే శక్తివంతమైన సాధనాలు మాత్రమే.కానీ మీ జీవితం అది ఒక సాఫ్ట్‌వేర్ కోడ్ కాదు. అది మీ స్వంత ప్రాజెక్ట్. దానికి మీరే ఏకైక ప్రాజెక్ట్ మేనేజర్.ఈ అపారమైన శక్తిని ఌ× ఎప్పటికీ భర్తీ చేయలేదు. ఎందుకంటే ఆ యంత్రానికి మీ నవ్వు వెనక ఉన్న నిశ్శబ్దం తెలియదు. మీ కన్నీళ్ళ వెనక దాగున్న సుదీర్ఘమైన పోరాట కథ తెలియదు. మీరు చిన్నప్పుడు ఆకాశంలో నక్షత్రాలను చూసి ఏమని స్వప్నించారో దానికి అవగాహన ఉండదు. అన్నింటికీ మించి, సుదూర ప్రాంతంలో ఉన్నప్పుడు మీ అమ్మ చేతి వంట వాసన లేదా ఆమె పిలుపు మీకు ఎందుకు అంతటి ఓదార్పునిస్తుందో ఆ యంత్రం తాలూకు అల్గారిథమ్‌కు అస్సలు అర్థం కాదు. అవన్నీ మీ సజీవ అనుభూతులు. అవే మిమ్మల్ని ఒక ప్రత్యేకమైన మనిషిగా నిలబెడుతున్నాయి.

మన పూర్వీకులు స్వీయ అన్వేషణను ఏదో ప్రత్యేకమైన ప్రక్రియగా కాకుండా, నిత్య జీవన విధానంలో ఒక భాగంగా మార్చారు. వారు దీనిని ఆత్మ విచారణ అని పిలిచారు. జీవితంలో ఏ ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందైనా, భావోద్వేగాల సుడిగుండంలో చిక్కుకున్నప్పుడైనా ఒక్కసారి అంతర్ముఖులై లోపలికి చూసుకోవడం మన సంస్కృతి నేర్పిన పాఠం.మన తెలుగు భాషలో ఒక అద్భుతమైన, అత్యంత పవిత్రమైన పదం ఉంది.సంతృప్తి. ఇది కేవలం ఏదో తిన్నాం, తాగాం అనే తాత్కాలిక తృప్తి కాదు ఇది నువ్వు ఎంచుకున్న మార్గంలో, నీ ఆత్మసాక్షికి కట్టుబడి, సత్యమైన రీతిలో జీవిస్తున్నావని నీ అంతరంగానికి తెలిసే ఒక పరమ శాంత స్థితి. ఈ అమూల్యమైన స్థితిని గూగుల్ సెర్చ్ ఇంజన్ ఏనాటికీ ఇవ్వలేదు. ఈ ప్రశాంతత కేవలం మీ అంతర్మథనం నుంచే జన్మించాలి.ఈ తరం పిల్లలు సోషల్ మీడియా వేదికలపై పదివేల మంది ఫాలోవర్లను, లైకులను చాలా సులభంగా సంపాదిస్తున్నారు. కానీ, అదే సమయంలో ఇంట్లో ఉన్న తమ తల్లిదండ్రులతో కూర్చుని పది నిమిషాలు మనసు విప్పి, నిజాయితీగా మాట్లాడలేకపోతున్నారు. ఇది నేటి ఆధునిక సమాచార యుగం మనకు తెచ్చిపెట్టిన అతి పెద్ద విరోధాభాస .ఈ వ్యాసం చదవడం పూర్తయిన తర్వాత, మీ జీవితంలో ఒక చిన్న మార్పుకు శ్రీకారం చుట్టండి. రేపు ఉదయం మీరు నిద్ర లేచిన వెంటనే, అలవాటుగా మొబైల్ స్క్రీన్ వైపు చూడకండి. నోటిఫికేషన్ల ప్రపంచంలోకి వెళ్ళిపోకండి. కేవలం అయిదు నిమిషాల పాటు ప్రశాంతంగా కూర్చుని, కళ్ళు మూసుకుని మీకు మీరు ఈ ప్రశ్న వేసుకోండి.నేను నిజంగా ఎవరిని? నా జీవితం నుండి నేను అసలు ఏమి ఆశిస్తున్నాను?ఈ ప్రశ్నకు సమాధానం మొదటి రోజే రాకపోవచ్చు, తీవ్రమైన గందరగోళం కలగవచ్చు. అయినా పర్వాలేదు, నిరాశపడకండి. కనీసం ఆ ప్రశ్నను మీకు మీరు రోజువారీగా వేసుకునే అలవాటు మొదలైతే చాలు. ఆ ఒక్క ప్రశ్నతోనే బాహ్య ప్రపంచపు అబద్ధాల నుండి మిమ్మల్ని మీరు కనుగొనే ఒక అద్భుతమైన అంతర్గత యాత్ర ప్రారంభమవుతుంది.ఎందుకంటే జీవితం అనేది కేవలం ఏదో ఒక గమ్యస్థానాన్ని చేరుకునే పరుగు పందెం కాదు అది ప్రతి క్షణాన్ని అనుభవించే ఒక సుదీర్ఘమైన ప్రయాణం. ఆ ప్రయాణంలో ఎల్లప్పుడూ మీ వెంట ఉండే అత్యంత నమ్మకమైన, ఏకైక తోడు కేవలం మీరే.కృత్రిమ మేధ ప్రపంచంలోని వేలాది సంక్లిష్టమైన ప్రశ్నలకు, గణిత సూత్రాలకు క్షణాల్లో సమాధానాలు వెతికి పెట్టగలదు. కానీ, నేను ఎవరిని? నా జీవన పరమార్థం ఏమిటి? అనే అత్యంత కీలకమైన ప్రశ్నకు మాత్రం ఏ AI సమాధానం చెప్పలేదు.దానికి మీరే, మీ అనుభవాల ద్వారా మాత్రమే బదులు కనుగొనాలి.ఆ ఆత్మ అన్వేషణ ప్రయాణంలో అడుగులు వేయడానికి అస్సలు భయపడకండి. మొదట్లో అది ఒంటరిగా, చాలా కష్టంగా అనిపించవచ్చు. కానీ, ఆ నిశ్శబ్ద పోరాటమే, ఆ కష్టమే మిమ్మల్ని మీకు సరికొత్తగా పరిచయం చేస్తుంది. లోతుగా ఆలోచించండి నీ ప్రశ్నలు నీవే, అవే నిన్ను ఒక సంపూర్ణమైన మనిషిగా మారుస్తాయి.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# ఎడిటర్ వాయిస్

## యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు.. విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఏ దేశానికైనా యువతే వెన్నెముక. నేటి యువత రేపటి నాయకులు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, పరిపాలకులు. అందుకే యువతను సరైన దిశలో నడిపించే శక్తి విద్యకు ఉంది. విద్య కేవలం ఉద్యోగం సంపాదించేందుకు మాత్రమే కాదు, వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక బాధ్యతలను అర్థం చేసుకోవడానికి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావడానికి కూడా దోహదపడుతుంది. ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోంది. సాంకేతికత, కృత్రిమ మేధస్సు, డిజిటల్ విప్లవం వంటి రంగాల్లో రోజుకో కొత్త ఆవిష్కరణ వెలుగులోకి వస్తోంది. ఈ పరిస్థితుల్లో యువత సంప్రదాయ విద్యతో పాటు ఆధునిక నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాల్సిన అవసరం ఉంది. పుస్తకాల పరిజ్ఞానం మాత్రమే కాకుండా, సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు వంటి అంశాలు కూడా ఎంతో ముఖ్యం.

అయితే నేటి యువత ముందున్న సవాళ్లు కూడా తక్కువ కావు. నిరుద్యోగం, పోటీ పరీక్షల ఒత్తిడి, సామాజిక మాధ్యమాల ప్రభావం, మాదకద్రవ్యాల వ్యసనం వంటి సమస్యలు అనేక మంది యువకుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వం, సమాజం కలిసి యువతకు సరైన మార్గదర్శనం అందించాల్సిన బాధ్యత ఉంది.

విద్యాసంస్థలు కేవలం మార్కుల తయారీ కేంద్రాలుగా కాకుండా, విలువలతో కూడిన పౌరులను తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, నైతిక విలువలు పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలి. అదే సమయంలో ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. దేశ జనాభాలో అత్యధిక శాతం యువతే ఉన్న భారతదేశానికి ఇది ఒక గొప్ప అవకాశం. ఈ యువశక్తిని సరైన దిశలో మలిస్తే భారత్ ప్రపంచంలో అగ్రగామి దేశంగా ఎదగడం ఖాయం. అందుకు విద్యనే ప్రధాన ఆయుధంగా ఉపయోగించుకోవాలి.

యువత కలలు కనాలి... ఆ కలలను నిజం చేసుకునే దిశగా కష్టపడాలి. విద్య, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విజయాన్ని ఎవరూ ఆపలేరు. యువత సాధించే ప్రతి విజయం దేశ ప్రగతికి బాటలు వేస్తుంది. అందుకే "విద్యావంతమైన యువత - అభివృద్ధి చెందిన భారతదేశం" అనే లక్ష్యంతో ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## గుర్తు తెలియని మగ శవం లభ్యం



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం సాయంత్రం 04.30 గంటలకు పై ఫోటోలో మగ వ్యక్తి సుమారుగా 45-50 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండి కాకినాడ జగన్నాధపురం ఉప్పుటేరులో ఉబ్బిపోయి నీటిలో తేలుతూ, కెనాల్ రోడ్‌లో రంగూన్ మేడ దగ్గరలో కనిపించిందని కాకినాడ వన్ సిఐ తెలిపారు. ఊరు పేరు వివరాలు తెలియని మగ వ్యక్తి, ఎత్తు: 5.6, దుస్తులు: మెరూన్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్టు, మెరూన్ కలర్ ఫాంట్, కుడి చెయ్యికి త్రాడు కలదు, ముఖము : బట్టతల, అచూకి తెలియజేసినవారికి తగిన పరతోశికం ఇవ్వబడను. ఆచూకి తెలియజేయ వలసిన ఫోన్ నంబర్స్ 9440796539, 0884-2379033 నందు తెలియజేయాలని సిఐ తెలిపారు.

## హైవేపై ట్రాక్టర్‌ను ఢీకొని.. పల్టీలు కొట్టిన కారు




**అనకాపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయగడ నుంచి ద్రాక్షారామం వెళ్తున్న కారు.. నక్కపల్లి వద్దకు రాగానే ప్రమాదానికి గురైంది. ట్రాక్టర్‌ను తప్పించేక్రమంలో దాన్ని వెనుక నుంచి ఢీకొని కారు పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ప్రయాణికులు ప్రవీణ్, రాజ్‌కుమార్, పద్మావతి, ఓ బాలుడు సహా ట్రాక్టర్ డ్రైవర్ అప్పలనాయుడు గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీకెమెరాల్లో నమోదయ్యాయి.

## మెదక్ జిల్లాలో ప్రతీకార హత్యలు.. సూరారంలో తీవ్ర ఉద్రిక్తత



**చిన్నశంకరంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పాత కక్షల నేపథ్యంలో పథకం ప్రకారం ఓ యువకుడిని ఆటోతో ఢీకొట్టి నిన్న హత్య చేయగా.. అందుకు ప్రతీకారంగా మృతుడి బంధువులు అతని హత్యకు కారకుడైన వ్యక్తి తండ్రిని రాత్రి హత్య చేశారు. ఈ ఘటన మెదక్ జిల్లాలో సంచలనం కలిగించింది. చిన్న శంకరంపేట మండలంలోని సూరారం గ్రామానికి చెందిన శ్రీధర్ సోమవారం చేగుంట మండలం అనంతసాగర్‌కు బైక్‌పై వెళ్తుండగా ఆటోతో ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. సూరారం గ్రామానికి చెందిన రణబోయిన ప్రభాకర్.. పాత కక్షల నేపథ్యంలో పథకం ప్రకారం చంపేశాడని మృతుని బంధువులు ఆందోళనకు దిగారు. తమను న్యాయం జరిగేవరకు మృతదేహాన్ని తీసుకెళ్లమని తేల్చి చెప్పారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ నచ్చజెప్పడంతో మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో మాసాయిపేటలోని ఓ దాబా వద్ద శ్రీధర్ బంధువులకు ప్రభాకర్ తండ్రి యాదగిరి కనిపించడంతో ఆగ్రహంతో ఉన్నవారు అతనిపై దాడి చేశారు. అక్కడి నుంచి తీసుకెళ్లి బండరాయితో కొట్టి హల్దీ వాగులో పడేశారు. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వాగులో నుంచి యాదగిరి మృతదేహాన్ని బయటకు తీసి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా... యాదగిరిని హత్య చేసిన వారు పోలీసులకు లొంగిపోయినట్టు సమాచారం.

## బాసర అమ్మవారి ఆలయంలో చోరీ



**బాసర, విశ్వం వాయిస్ న్యూస్ :** నిర్మల్ జిల్లాలోని బాసర అమ్మవారి ఆలయంలో చోరీ జరిగింది. సరస్వతీ అమ్మవారి ఆలయం పైఅంతస్తులోని మహంకాళి ఆలయంలో అమ్మవారి వెండి కిరీటం, హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మహంకాళి ఆలయ గేటు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. నగదు కాజేసి.. అనంతరం హుండీని వ్యాసగుడి దగ్గర పడేసి పరారయ్యారు. అర్చకులు మంగళవారం తెల్లవారుజామున పూజ కోసం వెళ్లి చూడగా చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఆలయ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయి. వెండి కిరీటం సుమారు కేజీన్నర ఉంటుందని ఆలయ అధికారులు చెబుతున్నారు. ఆలయంలో చోరీ దృష్ట్యా.. నేడు జరగాల్సిన హుండీ లెక్కింపును అధికారులు వాయిదా వేశారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ముథోల్ ఎమ్మెల్యే రామారావు, భైంసా సబ్ కలెక్టర్ ఆలయానికి చేరుకుని పరిశీలించారు.

## మల్లాపూర్‌లో వైద్యుడు ఆత్మహత్య

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని మల్లాపూర్‌లోని ఓ వైద్యుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. రికవరీ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుడు ఖాసిం హైమద్.. రెండో అంతస్తులో ఆత్మహత్య చేసుకున్నారు. మత్తు ఇంజెక్షన్ తీసుకుని ఆయన మృతిచెందారు. విశాఖపట్నానికి చెందిన ఖాసిం హైమద్.. యాకుత్‌పురాలో నివాసముంటున్నారు. వైద్యుడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## పహాడిషరీఫ్ పరిధిలోని ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్నిప్రమాదం



**విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధి బాలాజీనగర్‌లోని ఓ ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించింది. దట్టంగా పొగలు కమ్ముకొని మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో మంటల్ని అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## మా డబ్బుతోనే మమ్మల్ని దహనం చేయండి

**ఏటీఎంకార్డు వివరాలు రాసి బలవన్మరణం - భార్యకు బ్రెయిన్‌స్ట్రోక్‌తో కుంగిపోయిన భర్త**
**ఇద్దరు చిన్నారులకు విషమిచ్చి, తానూ తాగిన తల్లి.. ఉరేసుకున్న తండ్రి**




**చిత్తూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అనారోగ్యంతో ఉన్న భార్య చికిత్సకు ఆయన తన శక్తికి మించి ఖర్చు చేశారు.. వైద్యానికి మరింత డబ్బు వెచ్చించినా బతుకుతుందో లేదో చెప్పలేమని వైద్యులు అనడంతో కుంగిపోయారు. భార్య చనిపోతే ఇద్దరు బిడ్డలను తాను ఉన్నతంగా పెంచలేమోనన్న భయం ఆయన్ను పదేళ్లుగా వెంటాడింది. దీంతో ఆ దంపతులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. అల్లారుముద్దుగా సాకిన బిడ్డలకు విషమిచ్చి తర్వాత తల్లీ తాగింది.. తండ్రి ఉరేసుకున్నారు. అంత్యక్రియలకు తమ డబ్బులే వినియోగించాలని ఓ కాగితంపై రాసి ఇంటిలోని టీవీకి అతికించారు. అందులో ఏటీఎం పిన్ నంబరు రాశారు. చిత్తూరు జిల్లాలోని చిత్తూరు గ్రామీణ మండలం బంగారెడ్డిపల్లెలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పలమనేరు మండలం మండిపేట కోటూరుకు చెందిన దామోదరం (35) బాల్యంలోనే తల్లిని కోల్పోయారు. తండ్రి వేరే ప్రాంతానికి వెళ్లిపోవడంతో తన అక్క ఊరు బంగారెడ్డిపల్లెకు వచ్చారు. బావ గోపితో కలిసి మేస్త్రీగా పనిచేస్తున్నారు. గంగాధరనెల్లూరు మండలం అప్పిరెడ్డికండ్రిగకు చెందిన నిర్మల (28)ను దామోదరం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి దిలీప్ (12), శ్రీవిద్య (10) సంతానం. నిర్మల పదేళ్ల నుంచి బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారు. ఏడాదిగా ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. అప్పటికే అప్పులు పెరిగిపోయాయి. సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష వచ్చినా.. సరిపోలేదు. ఇటీవల చెన్నైలోని ఓ ఆసుపత్రికి వెళ్లగా రూ.7 లక్షలు ఖర్చవుతుందని, అయినా కోలుకుంటారనే నమ్మకం లేదని వైద్యులు చెప్పారు. అప్పటి నుంచి భార్యాభర్తలు కుంగిపోయారు. తాము చనిపోతామని దామోదరం తరచూ అక్కకు చెప్పి, బాధపడేవారు. తాము మరణిస్తే.. బిడ్డలు అనాథలవ్వకూడదని, వారినీ తమతో పాటు తీసుకెళ్లిపోవాలని దంపతులు ఆదివారం నిర్ణయించుకున్నారు. రాత్రి అక్క చిన్నతో కలిసి నలుగురూ భోజనం చేశారు. అనంతరం తమ ఇంటికి వెళ్లి, ఇద్దరు చిన్నారులకు నిర్మల విషం తాగించింది. తర్వాత తానూ తాగింది. ముగ్గురూ మరణించారని నిర్ధారించుకున్న తర్వాత దామోదరం ఉరేసుకున్నారు. సోమవారం ఉదయం తలుపులు తెరవకపోవడంతో చిన్న వచ్చింది. కిటికీలో నుంచి చూడగా ఉరికి వేలాడుతున్న తమ్ముడు కనిపించాడు. చుట్టుపక్కల వారితో కలిసి లోపలికి వెళ్లి చూడగా.. తల్లీ ఇద్దరు పిల్లలు పడకగదిలో విగతజీవులై ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం నలుగురికి అంత్యక్రియలు చేశారు. బీఎన్‌ఆర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పౌష్టికాహార భద్రత కోసం బయోఫోర్టిఫైడ్ రకాల పంటలు..

## రెండు నిర్దిష్ట కార్యక్రమాలను ప్రారంభించిన ఐసీఏఆర్




భారతదేశం వ్యవసాయాధారిత దేశం. అయితే రకరకాల అననుకూల పరిస్థితులు.. వ్యవసాయం నష్టాలనే మిగులుస్తుండడం... చీడపీడలు, తెగుళ్లు.. సకాలంలో వానలు కురవకపోవడం.. పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు ముంచెత్తడం.. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం... ఇలాంటి అననుకూల పరిస్థితులతో రైతులు వ్యవసాయం నుంచి తిరుగుముఖం పడుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అందుబాటులోకి తెస్తున్నాయి. అందులో భాగంగానే nutritional security కోసం కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా biofortified varieties పంటలను పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ICAR రెండు నిర్దిష్ట కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి Kailash Choudhary మంగళవారం లోక్‌సభలో తెలిపారు.

**ఆ రెండు కార్యక్రమాలు ఏంటంటే..**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ రెండు కార్యక్రమాలను రూపొందించింది : న్యూట్రి-సెన్సిటివ్ అగ్రికల్చరల్ రిసోర్సెస్ అండ్ ఇన్నోవేషన్స్, వ్యవసాయంలో విలువ జోడింపు, సాంకేతికత ఇంక్యుబేషన్ సెంటర్లు (వాటికా). వ్యవసాయంలో మహిళలపై ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ కింద, ICAR "పోషకాహార భద్రత కోసం స్థిరమైన విధానాలు", "పోషక భద్రత వ్యవసాయ కుటుంబాల ఆరోగ్య ప్రమోషన్" వంటి కార్యక్రమాలను కూడా అమలు చేస్తోంది. లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో, వ్యవసాయాభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కార్యక్రమాలలో భాగంగా పాఠశాలలు, సంఘాలలో న్యూట్రి-గార్డెన్‌లను నిర్మించామని, అక్కడ పోషకాహార విద్యపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు.


**రకరకాల పంటలు..**

ఇంకా దీనిమీద మంత్రి సమాచారం ఇస్తూ.. ICAR వరి, గోధుమ, మొక్కజొన్న, మినుములు, కందులు, వేరుశెనగ, లిన్సీడ్, ఆవాలు, సోయాబీన్‌లలో 79 పోషకాలు అధికంగా ఉండే బయోఫోర్టిఫైడ్ రకాలను అభివృద్ధి చేసింది అని తెలిపారు. కాలీఫ్లవర్, బంగాళదుంప, చిలగడదుంప, గ్రేటర్ యామ్, దానిమ్మ, అదనంగా ఎనిమిది బయోఫోర్టిఫైడ్ ఉద్యాన పంటల రకాలు, వివిధ మాస్ కమ్యూనికేషన్ మాధ్యమాలను కలుపుకొని శిక్షణలు, ప్రదర్శనల ద్వారా రైతులలో ప్రాచుర్యం పొందుతున్నాయి. ఐరన్, జింక్, కాల్షియం, ప్రొటీన్, విటమిన్ సి, ప్రొవిటమిన్ ఎ, ఒలేయిక్ యాసిడ్ వంటి ముఖ్యమైన ఖనిజాలు ఈ సాగులో మెరుగయ్యాయని మంత్రి అభిప్రాయంగా చెప్పుకొచ్చారు..

**ICAR గురించి...**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అనేది భారతదేశంలో వ్యవసాయ విద్య, పరిశోధనలను సమన్వయం చేసే స్వయం-పాలన సంస్థ. ఇది వ్యవసాయ మంత్రిత్వ శాఖలోని వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖకు నివేదిస్తుంది. దీని అధ్యక్షుడు కేంద్ర వ్యవసాయ మంత్రి. ఇది ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైన వ్యవసాయ పరిశోధన, బోధనా సంస్థల నెట్‌వర్క్. NARI కార్యక్రమం పోషకాహార భద్రతను పెంపొందించడానికి వ్యవసాయాన్ని పోషకాహారం, న్యూట్రి-స్మార్ట్ గ్రామాలతో అనుసంధానం చేస్తూ కుటుంబ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంపై దృష్టి పెడుతుంది.

# విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 24 జూన్, 2026




www.viswamvoice.com

# అంతర్‌జిల్లా మోటార్ సైకిల్ దొంగల ముఠా అరెస్ట్

## రూ.38 లక్షల విలువైన 38 వాహనాలు స్వాధీనం : జిల్లా ఎస్పి రాహుల్ మీనా







**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పలు జిల్లాల్లో మోటార్ సైకిళ్లను దొంగిలిస్తూ పోలీసులకు సవాల్‌గా మారిన అంతర్‌జిల్లా దొంగల ముఠాను రావులపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాకు చెందిన ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.38 లక్షల విలువైన 38 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గత నెల 22వ తేదీన రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో ఇంటి ముందు పార్క్ చేసిన హోండా యాక్టివా మోటార్ సైకిల్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా జూన్ 16న రావులపాలెం జొన్నాడ మార్గంలోని గౌతమి గోదావరి ఏటిగట్టు వంతెన సమీపంలో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లను దొంగిలించినట్లు అంగీకరించారు. పోలీసుల కథనం ప్రకారం, నిందితులు రాత్రి వేళల్లో ఇళ్ల ముందు లేదా రోడ్ల పక్కన పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకునేవారు. వాహనం హ్యాండిల్ లాక్‌ను బలవంతంగా విరగగొట్టి, ఇగ్నిషన్ వ్యవస్థలోని వైర్లను కలిపి క్షణాల్లో వాహనాన్ని స్టార్ట్ చేసి అక్కడి నుంచి పరారయ్యేవారు. అరెస్టైన వారిలో లక్కోజు రాజేష్ కుమార్, కళ్యాణం నరేష్, గుండుపల్లి సూర్యతేజ, రొట్టె నాగచైతన్య, ఆలపు రవికుమార్ ఉన్నారు. వీరిలో ఇద్దరిపై ఇప్పటికే మోటార్ సైకిల్ చోరీ కేసులు నమోదై ఉండగా, మరొక నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 15 బజాజ్ పల్సర్, 15 సుజుకి యాక్సెస్, నాలుగు హీరో గ్లామర్, రెండు హోండా యాక్టివా, ఒక హెచ్.ఎఫ్. డీలక్స్, ఒక హోండా డియో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం 38 వాహనాల్లో 35 వాహనాలు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 32 కేసులకు సంబంధించినవిగా గుర్తించగా, మరో మూడు వాహనాలకు సంబంధించి ఫిర్యాదులు నమోదు కాలేదని వెల్లడించారు. ఈ ముఠా కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. కేసును ఛేదించి భారీ సంఖ్యలో చోరీ వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసు బృందాన్ని జిల్లా పోలీసు అధికారి రాహుల్ మీనా అభినందించారు. కొత్తపేట ఉప పోలీసు అధికారి సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో రావులపాలెం, అమలాపురం క్రైమ్ విభాగం, ప్రత్యేక నేర విభాగం సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన దర్యాప్తుతో ఈ ముఠా గుట్టు రట్టయింది.

# రానున్న స్థానికసంస్థల ఎన్నికలపై దృష్టి సారించండి

## పార్టీ శ్రేణులకు జక్కంపూడి రాజా దిశానిర్దేశం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో అన్ని విభాగాల కమిటీలను పూర్తిచేసుకుని పటిష్టంగా ఉన్నామని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా అన్నారు. మంగళవారం కోరుకొండ లోని జక్కంపూడి క్యాంపు కార్యాలయంలో వివిధ విభాగాల కమిటీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిటీల నాయకులతో పార్టీ ప్రతిష్టకు తీసుకోవలసిన అంశాలపై చర్చించారు.గ్రామస్థాయి కమిటీలు తమ పరిధిలో సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థలకు అన్ని విభాగాలు కలిసికట్టుగా పనిచేస్తూ, గెలుపొందే అభ్యర్థులను ఎన్నుకోవాల న్నారు.చేనేత, వాణిజ్యం సాంస్కృతిక విభాగం, దివ్యాంగులు, న్యాయ విభాగం, సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ), మేధావుల వర్గం, పంచాయతీరాజ్, ఉద్యోగులు, ఫంక్షనర్స్, ముస్లింలు ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు వాలంటీర్లు క్రైస్తవ మైనారిటీ విభాగాలకు సంబంధించిన కమిటీలతో రాజా పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, వివిధ కమిటీలసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ పాఠశాలల వైపు చూడని

# విద్యాశాఖ అధికారులు

## అధిక ఫీజులు, నిబంధనల ఉల్లంఘనలపై తల్లిదండ్రుల ఆందోళన




**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్:** గోకవరం మం డలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించబడుతు న్నప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు, మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు లేకుండానే కొన్ని విద్యాసంస్థలు కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. విద్యాసంస్థల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలను విస్మరించి, విద్యార్థుల భవిష్యత్తుతో యాజమాన్యాలు ఆటలాడుతున్నాయని పలువురు తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. విద్యాసంస్థలకు విశాలమైన భవనం, ఆటస్థలం, పరిశుభ్రమైన వాతావరణం, తగిన తరగతి గదులు వంటి సదుపాయాలు తప్పనిసరిగా ఉండాల్సి ఉన్నప్పటికీ, కొన్ని పాఠశాలలు షెడ్లు లేదా ఇరుకైన ప్రదేశాల్లో నడుస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు చదువుకునే వాతావరణం కల్పించాల్సిన చోట కాలుష్యం, స్థలాభావం వంటి సమస్యలు ఉన్నాయని పేర్కొంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు విధానాలను పక్కనపెట్టి, కొంతమంది ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఫీజుల భారంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాపోతున్నారు. మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఫీజు నియంత్రణ వంటి అంశాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "విద్య వ్యాపారం కాకూడదు... విద్యార్థుల భవిష్యత్తే ప్రధాన లక్ష్యం కావాలి" అని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

# కొత్తూరు రైతు సేవా కేంద్రంలో రైతులకు ప్రత్యేక శిక్షణ




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం కొత్తూరు రైతు సేవా కేంద్రంలో ఆత్మ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వ ర్యంలో రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవ సాయ సంచాలకులు అరుణ, మండల వ్యవసాయ అధికారి టి.వి.ఆర్. మణిదీప్, రైతు శిక్షణా కేంద్రం నుండి విచ్చేసిన వ్యవసాయ అధికారి మనోహర్ హాజరై రైతులకు పలు కీలక సూచనలు చేశారు. భూసార పరీక్షా ఫలితాల ఆధారంగానే పొలాల్లో ఎరువులను వాడుకోవాలని, తద్వారా అనవసర పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చని అధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, సూక్ష్మ పోషకాల వాడకం వల్ల పంటల్లో కలిగే నాణ్యత, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. నూతన విధానంలో భాగంగా ఒక ప్రత్యేక యాప్ ద్వారా రైతులకు పారదర్శకంగా జరుగుతున్న ఎరువుల పంపిణీ ప్రక్రియను వివరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి, విత్తనం నుండి విక్రయం వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ శాఖ ప్రతిక్షణం అండగా ఉంటుందని అధికారులు భరోసా ఇచ్చారు. రైతులు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటూ ఆశించిన దిగుబడులు సాధించేలా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కొత్తూరు గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు అండగా డీటీఓ దేవిశెట్టి శ్రీనివాసరావు

## నాలుగో నిరుపేద కుటుంబాన్ని దత్తత తీసుకున్న జిల్లా రవాణా అధికారి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అయినవిల్లి మండలం కె.జగన్నాధపురం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు పిచ్చిక సత్యనారాయణ పక్షవాతం, గుండెపోటుతో ఈ నెల 19న మృతి చెందాడు. ఆయన భార్య సరస్వతి మానసిక దివ్యాంగురాలు కాగా, వారికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబంలో పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ ముగ్గురు ఆడబిడ్డలే తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆ కుటుంబాన్ని స్వయంగా సందర్శించి వారి పరిస్థితిని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి-4 పథకంలో భాగంగా ఇప్పటికే మూడు కుటుంబాలను దత్తత తీసుకున్న ఆయన, ఈ నిరుపేద కుటుంబాన్ని నాలుగో కుటుంబంగా దత్తత తీసుకుంటున్నట్లు గ్రామ పెద్దల సమక్షంలో ప్రకటించారు. కుటుంబానికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చిన శ్రీనివాసరావు, తక్షణ అవసరాల కోసం మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. మానసిక దివ్యాంగురాలైన సరస్వతికి వెంటనే ఫ్యాన్ ఏర్పాటు చేయించి, కుటుంబ సభ్యులకు అవసరమైన వస్త్రాలు కూడా అందజేస్తానని తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటిన దేవిశెట్టి శ్రీనివాసరావును గ్రామ పెద్దలు ములికి విఘ్నేశ్వరుడు, అంకం వీర్రాజు, ఇనుమర్తి రాజు, కోట సత్తిరాజు, కొంకి వెంకట్రావు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనుమర్తి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్లంబర్లకు భారీ ఉద్యోగ అవకాశాలు

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పరిశుభ్ర ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ల కార్యక్రమంలో భాగంగా గృహాలు, హోటళ్లు, రెస్టారెంట్లు మరియు ఇతర వాణిజ్య సంస్థలకు గ్యాస్ కనెక్షన్లు అందించడానికి ప్లంబర్లు, ఫిట్టర్లకు భారీ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరి శేషు తెలిపారు. సంబంధిత రంగాల్లో నైపుణ్యాలు, అనుభవం లేదా అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎంపికైన అభ్యర్థులకు పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ల ఏర్పాటుకు సంబంధించిన పనుల్లో ఉపాధి కల్పించబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 95159 12468 నంబర్‌ను సంప్రదించవచ్చు. అలాగే ఆన్‌లైన్ నమోదు కోసం 26-06-2026 తేదీన అమలాపురంలోని జిల్లా ఉద్యోగ మార్పిడి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# ఇంటింటికీ కూటమి సుపరిపాలన ఫలాలను వివరించాలి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిన ప్రయోజనాలను ప్రతి ఇంటికీ చేరవేసేందుకు పార్టీ శ్రేణులు ఇళ్ల వద్దకే వెళ్లే ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు. రామచంద్రపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని గత ఐదేళ్ల విధ్వంసక పాలన నుంచి బయటకు తీసుకువచ్చి, అభివృద్ధి, సంక్షేమ సమతుల్యతతో ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందన్నారు. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరే అనేక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి ప్రజల మన్ననలు పొందిందన్నారు. సామాజిక పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం, ఉచిత ఇసుక విధానం, ఉచిత విద్యుత్ పథకాలు, వైద్య సేవలు, మత్స్యకారులకు ఆర్థిక సహాయం, ఆటో డ్రైవర్ల సంక్షేమం వంటి పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, కార్మికులు, మత్స్యకారులు, వృద్ధులు, దివ్యాంగులు తదితర అన్ని వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను తెలియజేసి ప్రజాభిమానాన్ని మరింత పెంపొందించాలని కోరారు. రాష్ట్ర పునర్నిర్మాణం, ఉపాధి అవకాశాల పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఈ సమావేశంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, గ్రామీణ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, అమలాపురం పార్లమెంట్ ఈసీఎం పలివెల ప్రకాష్, స్వచ్ఛ ఆంధ్ర నిర్దేశకులు సలాది రమేష్, మేడిశెట్టి సూర్యనారాయణ, కూటమి పార్టీ నాయకులు, క్లస్టర్, కో క్లస్టర్, బూత్ బాధ్యులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో

# డిపో ఎదుట గేట్ మీటింగ్




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏ.పి.పి.టి.డి (ఆర్‌టిసి) ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో మంగళ వారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆర్టీసీ కార్మికుల గేట్ మీటింగ్ జరిగింది. ఈ గేట్ మీటింగ్ లో ఇయు, ఎన్ ఎం యు ఏ, ఎస్ డబ్ల్యు ఎఫ్, కెపీ, యుడబ్ల్యుయు యూనియన్ల నుంచి ఆర్టీసీ కార్మికులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ- విద్యుత్ బస్సు ఆపరేటర్ల కోసం డిపోలను ఖాళీ చేయించి పినాకిల్ వంటి ఎంఎన్ సీ ప్రైవేటు ఆపరేటర్లకు కట్టబెట్టే విధానాలు విరమించుకోవా లన్నారు. కొత్త డీఏ లు, ఐ ఆర్ లను వెంటనే ప్రకటించాలనీ, 12వ పీ ఆర్ సి కమీషన్ను నియమించాలని వారు డిమాండ్ చేశారు. స్త్రీ శక్తి పథకం విజయవంతం చేసేందుకు వెంటనే 4వేల కొత్తబస్సులు ఆర్టీసి కొనుగోలు చేయాలని కోరారు. అలాగే కాలం చెల్లిన పాత టిమ్స్ మిషన్ల స్థానంలో కొత్త టిమ్స్ ను సప్లై చేయాల న్నారు. స్త్రీ శక్తి పథకం టిక్కెట్టు ఇచ్చే విధానంలో వచ్చే ఇబ్బంలను తొలగించేందుకు గాను మహిళలకు ఇచ్చే జీరో టిక్కెట్లకు స్వస్తి పలికి డబ్బులు ఇచ్చిన వారికి మాత్రమే టికెట్లు ఇచ్చేలా నిబంధన సడలించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న గ్యారేజీ/నాన్ ఆపరేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి. ఎంఇహెచ్ఎస్ విధానం ద్వారా సరైన వైద్య సౌకర్యాలు అందడంలేనందున పాత పద్ధతుల్లో రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలు అందించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఐఎస్ ఆఫీస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి. విధి నిర్వహణ సమయంలో సిబ్బందిపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు గానూ ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలి. సిబ్బంది వంటి మీద చేయి పడితే నాన్ బెయిలబుల్ సెక్షన్స్ క్రింద కేసులు నమోదు చేయాలని కోరారు. అలాగే ఆర్టీసిలో అన్ని కేటగిరీలలో ఖాళీగా ఉన్న 10 వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. 11వ పిఆర్సి పెండింగ్ డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసరాజు,యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వివివి నారాయణ, కార్యదర్శి కె.వరలక్ష్మి, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి వి.ఎల్ నారాయణ, ఎన్ఎంయు సెక్రటరీ కెయం.రావు, అన్ని యూనియన్ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.








### విద్యార్థుల అభివృద్ధికి

# పరిశుభ్రమైన వాతావరణం అవసరం

## సంక్షేమ హాస్టళ్లలో నెట్ జీరో ఎనర్జీ కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహణ : జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్ నైడియా దేవి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్** : విద్యార్థులకు విద్య పట్ల మక్కువ పెరగాలంటే పరిసరాల పరిశుభ్రత చాలా అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్ నైడియా దేవి పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం ఆమె అధ్యక్షతన సంక్షేమ హాస్టళ్లలో నెట్ జీరో ఎనర్జీ కేంద్రాల ఏర్పాటుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించడం, భూగర్భ జలాల సంరక్షణను పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కోనసీమ జిల్లాలో ఎంపిక చేసిన 11 సంక్షేమ వసతి గృహాలను నెట్ జీరో ఎనర్జీ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఈ 11 వసతి గృహాలతో పాటు ఇతర హాస్టళ్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోలార్ ఎనర్జీ వినియోగం, వ్యర్థ జలాల నిర్వహణ, పండ్ల మొక్కల పెంపకం, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాల పెంపు వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సంక్షేమ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.7 ప్రకారం రెండు సంవత్సరాల కాలవ్యవధిలో వసతి గృహాల్లో నెట్ జీరో ఎనర్జీ కార్యక్రమాలను రెండు దశల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మొదటి దశ ఈ నెల నుంచి మే 2027 వరకు కొనసాగుతుందని, రెండో దశ మరో సంవత్సరం పాటు అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 1,000 వసతి గృహాలను ఎంపిక చేయగా, కోనసీమ జిల్లాకు 11 వసతి గృహాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వసతి గృహాలను పర్యావరణహితంగా, స్వయం సమృద్ధి గల నెట్ జీరో ఎనర్జీ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు కె.గౌరీశంకర్, కృష్ణ అంజలి ప్రత్యూషలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నెట్ జీరో ఎనర్జీ కేంద్రాల ఏర్పాటు, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాల తగ్గింపు వంటి అంశాలను వివరించారు. వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా శాస్త్రీయ పద్ధతుల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తూ వసతి గృహాల ఆవరణలో పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని చెప్పారు. దీని ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఫలసాయాన్ని కూడా పొందవచ్చని వివరించారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం అమలులో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ సాంకేతిక సహకారం, మార్గదర్శకత్వం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి పి.జ్యోతిలక్ష్మి దేవి, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, సంబంధిత వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

### అమలాపురంలో ఏపీజీఈఏ

# కోనసీమ జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం

## రెండు వేల మందికి పైగా ఉద్యోగుల హాజరు అంచనా
## రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర నాయకులు, 20 జిల్లాల ప్రతినిధులకు మహాసభ ఆహ్వానం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్** : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రథమ జిల్లా కౌన్సిల్ సమావేశానికి విస్తృత స్థాయిలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమలాపురం-ఎన్‌హెచ్-216 రహదారిపై బోడసకుర్రు రేవు బ్రిడ్జి సమీపంలోని బి.ఆర్.కే కన్వెన్షన్‌లో ఈ చారిత్రాత్మక సమావేశం ఘనంగా జరగనుంది. ఈ మహాసభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలు, అన్ని కేడర్ల ఉద్యోగులను సంఘం నాయకులు వ్యక్తిగతంగా ఆహ్వానించారు. అలాగే కోనసీమ జిల్లాలోని అన్ని శాసనసభ్యులను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ), వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులను కూడా మర్యాదపూర్వకంగా కలిసి సభకు ఆహ్వానించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగసాయి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్రంలోని సుమారు 20 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అమలాపురానికి తరలివచ్చేందుకు ఇప్పటికే సన్నాహాలు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రథమ కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. వారి సమక్షంలో ఉద్యోగుల సమస్యలు, ప్రభుత్వానికి వినిపించాల్సిన అంశాలు, ఉద్యోగ సంక్షేమానికి సంబంధించిన కీలక తీర్మానాలు ఆమోదించనున్నట్లు సంఘం నాయకులు వెల్లడించారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, ఉద్యోగ హక్కుల పరిరక్షణ, సేవా నియమాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, సంక్షేమ చర్యలు, పెండింగ్ డిమాండ్ల సాధన తదితర అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు పలు కీలక తీర్మానాలు ఆమోదించి, రాష్ట్ర నాయకత్వం ద్వారా ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ నాయకత్వంలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరుతాయనే విశ్వాసంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అన్ని కేడర్ల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రథమ కౌన్సిల్ సమావేశం ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు సంఘటిత శక్తిని మరింత బలోపేతం చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. జిల్లా నుంచే సుమారు రెండు వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఆహ్వానాలు పంపగా, వేలాదిమంది ఉద్యోగులు సభకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. సభకు హాజరయ్యే ఉద్యోగుల కోసం భోజన, ఆతిథ్య ఏర్పాట్లు కూడా ప్రత్యేకంగా చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సాయంత్రం 4 గంటల వరకు అన్ని కార్యక్రమాల్లో ఉద్యోగులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సభా వేదిక విషయంలో ఎలాంటి గందరగోళానికి గురికావద్దని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ సమావేశం అమలాపురం-ఎన్‌హెచ్-216పై బోడసకుర్రు రేవు బ్రిడ్జి సమీపంలోని బి.ఆర్.కే కన్వెన్షన్‌లోనే జరుగుతుందని, ఉద్యోగులందరూ నేరుగా సభా ప్రాంగణానికి చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి కోనసీమ జిల్లా అధ్యక్షుడు కె.మల్లేశ్వరరావు (మల్లిబాబు), అసోసియేట్ అధ్యక్షుడు కె.వీరబాబు, కోశాధికారి జె.ఏ.ఎస్.కె. రాజ్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు యు. కుమారి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.శివప్రసాద్ వర్మ, అమలాపురం తాలూకా అధ్యక్షుడు పి. కామేశ్వరరావు, ఆర్ అండ్ బి శాఖ ఉద్యోగుల నాయకుడు కె.శ్రీనివాసరావు, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యుడు ఎం. నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు జె.వి.కృష్ణకుమారి, భూగర్భ జలశాఖ అధికారి ఎస్. దుర్గాప్రసాద్‌తో పాటు తూర్పుగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుంచి పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొననున్నట్లు సంఘం ప్రకటించింది.

### కే.గంగవరం మండల కేంద్రంలో

# ఘనంగా ఒలింపిక్ రన్ నిర్వహణ




**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్** : కే.గంగవరం మండల కేంద్రంలో ఈరోజు ఒలింపిక్ రన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినీ-విద్యార్థులు, గ్రామస్తులు ఎంతో ఉత్సాహంగా, చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల ఒలింపిక్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, మండల ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సురేష్ కుమార్ కార్యదర్శి బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కే.గంగవరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి. సోమేంద్ర, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పంపన నాగమణి సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారులు అలజంగి నాగరాజు, సోడిశెట్టి ఆంజనేయులు, డిప్యూటీ ఎంపీడీవో సాంబశివ, సచివాలయ ఉద్యోగులు, ఇతర అధికారులు పాల్గొని ఒలింపిక్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 23న ప్రారంభమైన ఒలింపిక్ క్రీడల స్ఫూర్తిని ప్రజల్లో చాటిచెప్పేందుకు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఒలింపిక్ రన్ నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని, ముఖ్యంగా ప్రతి మండలం నుంచి కనీసం ఒక ఒలింపియన్ తయారవ్వాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం క్రీడా రంగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ-విద్యార్థులను ప్రత్యేక ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఒలింపిక్ విలువలు, క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన కల్పించడంలో ఈ కార్యక్రమం ఎంతో ప్రేరణాత్మకంగా నిలిచిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

### అధికారంలో ఉండగా వైయస్సార్ పార్టీ అధినేత

# జగన్ కాపులకు చేసింది ఏమీ లేదు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్** : అధికారంలో ఉండగా వైయస్సార్ పార్టీ, ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి కాపులకు చేసింది ఏమీ లేదు.గత ఎన్నికల్లో కాపు ఓట్లు తనకు అవసరం లేదనట్లుగానే ఆయన ఎన్నికల్లో ముందుకెళ్లారు. అధికారం పోయిన తర్వాత కాపుల అవసరం గుర్తించి కాపులకు అన్యాయం జరుగుతుందని కాపు నేతలతో మాట్లాడిస్తున్నారు, కాపు నేతలు నోట బూతులు పలికిస్తున్నారు. 2024 ఓటమితో ప్రాంతాలు, మతాలు, కులాలు మధ్య చిచ్చుపెట్టి చలికాచుకోవాలని వైసీపీ పార్టీ చూస్తోంది.వైసీపీ కాపు నేతలను రెచ్చ గొట్టి, తప్పులు చేయించి, జీవితాంతం తన చుట్టూ ఉండేలా పులివెందుల సంస్కృతిని రాష్ట్రం లో తీసుకువస్తున్నారు. జగన్. శ్రీలక్ష్మి, అంబటి, పేర్ని, గుడివాడ లాంటి వారితో తప్పులు చేయించారు. జైలుకు పంపారు.నేరస్తులను ప్రోత్సహించడం వైసిపి పార్టీ సంస్కృతిగా మారింది.కులాలకు అతీతంగా అన్ని వర్గాలు వారి ఆదరణతో రాష్ట్రంలో నమ్మకం- సంక్షేమం- అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోంది అని ముత్యాల బాబ్జి.జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు.గనిశెట్టి వీరేష్.కొత్తపేట మండల టీడీపీ అధ్యక్షుడు.ఎలిశెట్టి ప్రభాకర్.కొత్తపేట గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శి. తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు జొన్నాడ సర్వీస్ రోడ్ల పనులు ప్రారంభం



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్** : గత కొన్ని సంవత్సరాలుగా వాహనదారులకు శాపంగా మారిన కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం జొన్నాడ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ల నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతున్న నేపథ్యంలో తక్షణమే ఈ సర్వీస్ రోడ్లు నిర్మించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ లు చేయని ప్రయత్నం అంటూ లేదు.పాత కాంట్రాక్టర్ సంస్థ తప్పించి వేరే వారికి ఇవ్వాలని వీరు పట్టుపట్టారు.కొత్త కాంట్రాక్టు సంస్థకు అప్పగించాలని కేంద్ర రవాణా ఉపరితల మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేయించారు. ఈ నేపథ్యంలో ఆ పాత కాంట్రాక్ట్ సంస్థలో కదలిక వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఈ సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.జొన్నాడ గ్రామం వైపు రోడ్డు రాకపోకలు నిలిపివేసి ఈ పనులను చేపడుతున్నారు.ఈ వారం లోనే ఈ సర్వీస్ రోడ్లు రెండూ నిర్మాణ పూర్తి చేయడానికి కాంట్రాక్ట్ సంస్థ అన్ని చర్యలు చేపట్టింది. అదేవిధంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా వేగవంతం చేసింది.

# డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



**కాట్రేనికోన, విశ్వంవాయిస్ న్యూస్** : డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పానసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన 75 బూతులు గ్రంధి నాని బాబు వారి ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ భారతీయ జనతా పార్టీ జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ పాల్గొని వారి చిత్రపటానికి పుష్పాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ, (1901, జూలై 6) ప్రముఖ జాతీయవాద నేతలలో ముఖ్యుడు.1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించాడు. హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడైన శ్యాం ప్రసాద్ ముఖర్జీ, జనసంఘ్‌ను స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందినాడు. కలకత్తా విశ్వవిద్యాలయం కులపతిగా పనిచేసిన అశుతోష్ ముఖర్జీ కుమారుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ కోల్‌కత లోనే ఉన్నత విద్యాభ్యాసం అభ్యసించి ప్రారంభంలో కాంగ్రెసు వాదిగానే రాజకీయ జీవితం ఆరంభించాడు. స్వాతంత్ర్యానికి పూర్వం జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రిగా పనిచేశాడు. 1949లో ఢిల్లీ ఒప్పందానికి వ్యతిరేకంగా కాంగ్రెసు పార్టీ నుంచి తప్పుకొని అక్టోబరు 21, 1951 న జనసంఘ్ పార్టీని స్థాపించి, ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా మే 23, 1953 న మరణించేవరకు కొనసాగినాడు. డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను దేశ ప్రధాని నరేంద్ర మోడీ నెరవేరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధి మణికంఠ చెరుకు రాంబాబు గ్రంధి మహేష్ చిట్టూరి మణికంఠ కాదా ప్రసాదు రంబాల గంగాధరం సమసాని మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# విజయోత్సవ విందుకు ఆహ్వానం : ఎమ్మెల్యే ఆనందరావు




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్** : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా, అలాగే అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు విజయోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న "విజయోత్సవ విందు" కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం జూన్ 26, 2026 శుక్రవారం ఉదయం 9:00 గంటలకు ప్రారంభం కానుంది. ఉదయం 11:00 గంటల నుంచి విందు ఏర్పాటు చేశారు. ఈ వేడుక ఆంధ్రా గోవా కోకో బీచ్, సూరసేన, యానాం వద్ద జరుగుతుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే వారు బొకేలు, పూలదండలు, శాలువాలు లేదా కేకులు తీసుకురావద్దని కోరారు. వాటి స్థానంలో విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలని సూచించారు.

# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ ఘనంగా నిర్వహణ



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్** : శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలి దాన్ దివస్ సందర్భంగా అమలాపురం పట్టణ బీజేపీ అధ్యక్షుడు అయ్యల భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ మాట్లాడుతూ "ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా" అనే నినాదంతో దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు, జనసంఘ్ వ్యవస్థాపకుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని పేర్కొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బీజేపీ పట్టణ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి చికరమెల్లి శ్రీనివాస్, మండల ఇన్‌చార్జి చెరుకూరి గోపాలకృష్ణ, జిల్లా కార్యాలయ కార్యదర్శి దాట్ల సుబ్బరాజు, జిల్లా పార్టీ కార్యదర్శి రమా వర్మ, నాయకులు ఇళ్ల సత్యనారాయణ, సంసాని రత్నకుమార్, పావులూరి వెంకట్, చల్ల సాయి రామకృష్ణ, దాకే వెంకటరావు, మన్నె రామదాసు, చిట్టూరి రాజేశ్వరి, షేక్ షహీర్, అప్పన గణపతి, దేవదాసు నాగార్జున ప్రసాద్, అరిగెల తేజ వెంకటేష్, నల్లా గోపి తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే నానాజీని ఢీ కొట్టడం

# వైసిపి నేతలకు సాధ్యం కాదు

### కాకినాడ రూరల్ పంతం అడ్డ : హెచ్చరించిన జనసేన నాయకులు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీనీ ఢీ కొట్టడం వైసీపీ నేతలకు సాధ్యం కాదని జనసేన నాయకులు మంగళవారం సాయంత్రం గంగరాజు నగర్ లో జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకులు తోట త్రిమూర్తులపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడ రూరల్ పంతం అడ్డ అని స్పష్టం చేశారు జనం కోసం పుట్టిన పార్టీ జనసేనని జనం కోసం పనిచేసే నాయకుడు నానాజీ అని ఇప్పటికైనా వైసిపి నాయకులు గుర్తించుకోవాలన్నారు. తోట త్రిమూర్తులు అవసరాల గడుపుకోవడం కోసం రోజుకో పార్టీ మారారని వారు ఆరోపించారు 2024 ఎన్నికల్లో మండపేట నుంచి పోటీ చేసినప్పుడు ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని మాట్లాడారని గుర్తు చేశారు. ఇదే వ్యక్తికి ఈరోజు మాట్లాడే మాటలు విలువలు ఏమిటి అని ప్రశ్నించారు. రామచంద్రపురం నుండి మండపేట వెళ్లి మీరు తెచ్చుకున్న ఓట్లు ఎన్ని అని ప్రశ్నించారు. కాకినాడ రూరల్ లో పంతం మీద నమ్మకంతో ప్రజలు 72,000 ఓట్లు మెజారిటీ ఇచ్చారని అది గుర్తించుకోవాలన్నారు. ఎప్పుడు శాంతియుత వాతావరణంలో ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి సంక్షేమం గా నానాజీ పని చేస్తున్నారని అన్నారు. వైసిపి ఎలాగైనా గెలవదని గుర్తించిన తోట స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించడంతోనే అర్థమవుతుందన్నారు. రూరల్ లో నానాజీని ఢీకొట్టడం కన్నబాబుకు సాధ్యం కాదని గుర్తించిన వైసీపీ నేతలు కనీసం తోట నైనా స్వతంత్రంగా బరిలో దించాలని నిర్ణయానికి వచ్చినట్లు అర్థం అవుతుందని అన్నారు.తోట త్రిమూర్తలు ఇప్పటివరకు టిడిపి,కాంగ్రెస్,పి ఆర్ పి తరువాత వైసిపి కండువాలు కప్పుకున్నారని ఇప్పుడు స్వతంత్రంగా పోటీ చేసి గెలవాలంటే అది పగటి కలే అన్నారు. రూరల్ లో నానాజీ ఢీకొట్టడం తోట త్రిమూర్తులు వల్ల కాదని హెచ్చరించారు. కాపీ యువతను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారు వైసిపి పార్టీ వాళ్లు అని అన్నారు. మా ఎమ్మెల్యే నానాజీ తప్పుగా మాట్లాడితే క్షమించేది లేదని హెచ్చరించారు. అలాగే కాపు మహిళలు రోడ్డు మీద కొట్టినప్పుడు అసభ్య పదజాలంగా మాట్లాడినప్పుడు నోరు ఏమైందని వంగ గీతను ప్రశ్నించారు. కాపుల కోసం మీరు ఏం చేశారని మీడియా ద్వారా నిలదీశారురు. జగన్ కాపు కార్పొరేషన్ రద్దు చేసినప్పుడు నోరు ఎందుకు మెదపలేదని జన సైనికులు ప్రశ్నించారు. దళిత సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని జగన్ రద్దు చేసిన పథకాలను తిరిగి పునర్దిస్తోందని అన్నారు ఈ సమావేశంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా, కాకినాడ రూరల్ మండల ఉపాధ్యక్షుడు అద్దంకి వీరబాబు, కరప మార్కెట్ కమిటీ చైర్మన్ సైనివరపు భవాని శంకర్, కరప మండలం వ్యవసాయ శాఖ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్,ఖాదీ బోర్డు డైరెక్టర్ సిరంగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసీ ఏవోఐ యూనియన్

# డివిజనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి డివిజనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) సమావేశం మంగళవారం అమలాపురంలోని యూటీఎఫ్ ఎంప్లాయీస్ హోంలో నిర్వహించారు. డివిజనల్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన, ఎల్ఐసీ ఏవోఐ యూనియన్ అమలాపురం బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. సమావేశంలో 2026 సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించడంతో పాటు, ఆగస్టు 5, 6 తేదీల్లో కేరళలో జరగనున్న ఆల్ ఇండియా సమావేశాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి పి.ఎల్.నరసింహారావు ఎల్ఐసీలో భవిష్యత్తులో జరగబోయే మార్పుల గురించి సభ్యులకు వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఏవోఐ యూనియన్ ఎల్లప్పుడూ పేద ప్రజల పక్షాన పోరాడుతూ ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఎల్ఐసీ ఇటీవల ప్రవేశపెట్టిన పలు పథకాల గురించి సభ్యులకు అవగాహన కల్పించారు. డివిజనల్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు మాట్లాడుతూ డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తక్కువ కాలంలోనే డివిజన్ పరిధిలోని బ్రాంచ్‌ల సమస్యలు, ఏజెన్సీకి సంబంధించిన అంశాల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో కూడా సభ్యుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ లోగో, పోస్టర్‌ను యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం డివిజన్ కార్యదర్శి బాల రమేష్ కుమార్, డివిజన్ ట్రెజరర్ వెంకటేశ్వరరావు ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వివిధ బ్రాంచ్‌లకు చెందిన యూనియన్ నాయకులు ప్రసంగించారు. సమావేశానికి హాజరైన రాష్ట్ర, డివిజన్, బ్రాంచ్ నాయకులు, అధ్యక్షులు, కార్యదర్శులు, ట్రెజరర్లకు అమలాపురం బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. వివిధ బ్రాంచ్‌ల నుంచి పెద్ద సంఖ్యలో యూనియన్ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రాజకీయ లౌక్యం నేర్చుకో సేనానీ !



నిజానికి వేరే రంగంలో నుంచి వచ్చిన వారికి ట్రెడిషనల్ పాలిటిక్స్ అన్నవి అంత సులువుగా ఒంటబట్టవు. పవన్ కళ్యాణ్ మాటలు విన్నపుడు ఎవరికైనా తోచేది ఏమిటి అంటే తమ మనసులో ఉన్నది ఆయన నోటి నుంచి చెబుతున్నారని. సగటు మనిషి ఏదైతే అనుకుంటాడో అది పవన్ చెబుతున్నారు. అయితే పవన్ సగటు మనిషి కాదు, ఆయన సినీ రంగంలో తిరుగులేని సూపర్ స్టార్. ఇక రాజకీయ రంగంలో చూస్తే జనసేన అధినేత, అలాగే ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు. దాంతో పవన్ అందరిలా మాట్లాడితే అసలు బాగోదు. ఆయన ఆచీ తూచీ మాత్రమే మాట్లాడాలి. అంతే కాదు ఆయన ప్రతీ మాట వెనక హోదా ఆయన ఇమేజ్ అన్నీ మిళితం అయి ఉంటాయని కూడా గుర్తు పెట్టుకుని మాట్లాడాల్సి ఉంటుంది. లేకపోతే అదే ఆయన రాజకీయ జీవితం మీద కూడా ప్రభావం చూపిస్తుంది అన్న విశ్లేషణలు ఉన్నాయి.

**ఉన్నది ఉన్నట్లుగా :** రాజకీయాలు అంటేనే బోలెడు ఉంటాయి. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడితే బహు కష్టం. ఒక మాటకు వేయి అర్థాలు పరమార్థాలు ఈ సోషల్ మీడియా యుగంలో తీస్తారు. ఇక పవన్ కళ్యాణ్ తాజాగా కాకినాడలో జరిగిన మాటా మంతి కార్యక్రమంలో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు అయితే ప్రత్యర్థి పార్టీల సంగతి పక్కన పెడితే తటస్థులను మేధావులను కూడా ఆలోచనలో పడేస్తున్నాయి. తాను హోం మంత్రిని కాను అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అంత అవసరమా అన్న చర్చ కూడా వస్తోంది. అంతే కాదు ఆయనకు అక్కడికి ఆ పదవి మీద మోజు ఉన్నట్లుగా ప్రొజెక్షన్ ఇచ్చే వారూ ఉన్నారు.

**ఓపెన్ అయిపోతేనే :** మరో వైపు చూస్తే ప్రీతి సుగాలీ కేసుని కూడా ఆయన ఆ సమావేశంలో లేవనెత్తి వివరణ ఇవ్వడం వల్ల కూడా కొత్త ఇబ్బందులు వచ్చాయని అంటున్నారు. ఇక విజయవాడలో జరిగిన ఒక యువకుడు అదృశ్యం కేసులో కూడా పవన్ ఎక్కువగానే మాట్లాడారు అని అంటున్న వారూ ఉన్నారు. ఒక బలమైన సామాజిక వర్గానికి పదే పదే ఇబ్బంది కలిగేలా పవన్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలు కూడా పార్టీకి మేలు చేసేవి కావనే సూచనలు హితైషుల నుంచే వస్తున్నాయి అంటున్నారు.

**అధికారంలో ఉంటూ :** ఇక పవన్ కళ్యాణ్ ఇపుడు అధికారంలో ఉన్నారు. ఆయన చేతిలో పవర్ ఉంది. ఆయన ఏమి చేయదలచుకున్నా అధికారులను ఆదేశించగలరు, సమీక్షలు చేయగలరు. అలాగే తాను ఏమి చెబుతున్నారో అది చాలా మౌనంగా చేసుకుని పోవచ్చు. చట్టం తన పని తాను చేస్తుంది అన్న తరహాలో పవన్ అధికార తీరు కొనసాగించవచ్చు. కానీ ఆయన ఇంకా వెనకటి ప్రతిపక్ష పాత్ర మాదిరిగానే విమర్శలు హెచ్చరికలు చేయడం మాత్రం కొంత ఇబ్బందిగానే ఉందని అంటున్నారు.

**ట్రెడిషనల్ పాలిటిక్స్ :** నిజానికి వేరే రంగంలో నుంచి వచ్చిన వారికి ట్రెడిషనల్ పాలిటిక్స్ అన్నవి అంత సులువుగా ఒంటబట్టవు. రాజకీయ నాయకుడు కావడానికి మళ్లీ కొత్తగా పుట్టాలా అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. కానీ పుట్టనక్కరలేదు కానీ సాధన చేయాల్సి ఉంటుంది. చాలా నేర్చుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే కోట్లాది మంది ప్రజలతో ముడిపడి ఉన్న వ్యవహారం ఇది. ఎంతో ఆశగా జనాలు చూస్తూంటారు. అధికారంలో ఉన్న వారు అయితే ఆకాశం అంత ఎత్తున నిలిచి ఉంటారు. మరి వారికి జనాలు అంతా ఒక సమూహంగా కనిపించవచ్చేమో. కానీ జనాలకు మాత్రం వారు స్పష్టంగా కచ్చితంగా కనిపిస్తారు.

**అక్కడ రీ సౌండ్ :** వారి మాట తీరు అంతా కూడా జనాల కళ్లలో మెదడుతో పూర్తి స్థాయిలో రికార్డు అయి ఉంటుంది. జనాలది ఏముందిలే అనుకోవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో వారే ప్రభువులు. మౌనంగా వారు ఈ రోజున ఉండొచ్చు. సరైన సమయంలో తమ అధికారాలను వారు చూపిస్తారు. అందువల్ల అధికారంలో ఉన్న వారు కోటి కాంతుల వెలుగులో ఉన్నట్లు లెక్క. అందుకే వారు మరీ మరీ జాగ్రత్త పడాల్సి ఉంటుంది. తాను పారదర్శకంగా ఉన్నాను అని నాయకులు బోళాగా మాట్లాడవచ్చు. కానీ జనాలకు అది వేరే విధంగా రీ సౌండ్ చేస్తుంది. సో జనసేనాని అయితే రాజకీయ లౌక్యం ఇంకా నేర్చుకోవాల్సి ఉందని మాత్రం అంతా అంటున్నారు.

# 'సీక్రెట్' మీటింగ్ కలకలం

### మోదీ దృష్టికి లోకేశ్ భేటీ - యువనేత క్లారిటీ ఇదే..



ఢిల్లీలో జాతీయ మీడియా చర్చా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ గత కొద్ది రోజులుగా పొలిటికల్ సర్కిల్స్ లో విస్తృత చర్చగా మారిన ప్రత్యేక సమావేశంపై పూర్తి వివరణ ఇచ్చారు. ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ అవుతున్న 'సీక్రెట్' మీటింగ్'పై మంత్రి నారా లోకేశ్ క్లారిటీ ఇచ్చారు. ఢిల్లీలో జాతీయ మీడియా చర్చా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ గత కొద్ది రోజులుగా పొలిటికల్ సర్కిల్స్ లో విస్తృత చర్చగా మారిన ప్రత్యేక సమావేశంపై పూర్తి వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తోపాటు మాజీ ఉప రాష్ట్రపతి, ఒక ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం మధ్య రహస్య సమావేశం జరిగిందని కొద్దిరోజులుగా టాక్ నడుస్తోంది. ఈ విషయం ప్రధాని మోదీ దృష్టికి వెళ్లిందన్న సమాచారం మరింత హీట్ పెంచింది. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ ఆ రహస్య సమావేశంపై స్పందించారు. ప్రచారంలో ఉన్నట్లు సమావేశం జరగడం నిజమే కానీ, ప్రచారంలో ఉన్న వదంతులు నిజం కావని స్పష్టం చేశారు. తాము ఎన్డీఏతో కలిసి నడుస్తామని, ప్రధాని మోదీకి ఎప్పుడూ తమ మద్దతు ఉంటుందని తేల్చిచెప్పారు. దీంతో కొద్దిరోజులుగా హల్ చల్ చేస్తున్న ఊహాగానాలకు తెరదించినట్లైందని అంటున్నారు.

**అసలేం జరిగిందంటే..**


ఏపీలో పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున పారిశ్రామిక వేత్తలతో సంప్రదింపులు జరుపుతోంది. ప్రధానంగా మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రిగా ఉన్న లోకేశ్ పెట్టుబడుల ఆకర్షణకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్నా, ఢిల్లీ పర్యటనకు వెళ్లినా పెట్టుబడుల సాధనకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. అదేవిధంగా విదేశీ పర్యటనలలో సైతం పారిశ్రామిక వేత్తలను కలిసేందుకే పెద్ద పీట వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి లోకేశ్ ఇటీవల ఓ బడా పారిశ్రామిక వేత్తను కలిశారని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ భేటీకి మంత్రి లోకేశ్ తోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి ఉండటం రాజకీయంగా ఆసక్తి రేపింది. ఇదే సమయంలో ఈ భేటీపై ప్రభుత్వం ఎటువంటి అధికారిక ప్రకటన చేయకపోవడంపై రకరకాల ప్రచారం జరిగింది. అయితే ఈ సమావేశంలో చర్చించిన అంశాలు అనివార్యంగా బయటకు పొక్కడంతో పొలిటికల్ సర్కిల్స్ లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఇది కేవలం ఒక వ్యక్తిగత సమావేశమా లేక రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన వ్యూహాత్మక భేటీనా అన్నది అప్పట్లో సస్పెన్స్‌గా మారింది. ఈ భేటీ వల్ల పొత్తు రాజకీయాల్లో ఏమైనా మార్పులు వస్తాయా? లేక ఎన్డీయే కూటమిలో అంతర్గత చర్చలు మొదలయ్యాయా? అనే కోణంలో మీడియాలో కథనాలు మొదలయ్యాయని అంటున్నారు. ఈ సమాచారం ఢిల్లీ స్థాయికి చేరడం, స్వయంగా ప్రధాని మోదీ వరకు వెళ్లడం ఏపీ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. ఒక యువనేతగా, మంత్రిగా లోకేశ్ తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని భావించిన ప్రధాని కార్యాలయం, దీనిపై ఆరా తీసినట్లు సమాచారం. నిరంతరం అప్రమత్తంగా ఉండే బీజేపీ అధిష్టానం, ఈ భేటీ ఉద్దేశాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నించిందని కూడా చెబుతున్నారు.

**లోకేష్ క్లారిటీ**

ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ చాలా పరిణితితో వ్యవహరించారు. ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా, ఈ భేటీ వెనుక ఉన్న ఉద్దేశాన్ని ఆయన ప్రధాని మోదీకి వివరించినట్లు తెలుస్తోంది. రాష్ట్రానికి అవసరమైన పెట్టుబడులు, సాంకేతిక సహకారం, మౌలిక సదుపాయాల కల్పన కోసమే తమ భేటీలో చర్చించామని, ఇందులో ఎటువంటి రాజకీయ అజెండా లేదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. లోకేశ్ ఇచ్చిన వివరణపై ప్రధాని మోదీ కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రగతి కోసం ఎవరిని కలవడానికైనా, ఎలాంటి చర్చలు జరపడానికైనా సంకోచించాల్సిన అవసరం లేదని, అయితే పారదర్శకత చాలా ముఖ్యమని ఆయన సూచించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్.. రేపే ప్రారంభం.. ఏపీలో కొత్త చరిత్ర!

మన రాష్ట్రంలో బంగారు నిక్షేపాలను వెలికి తీసే కీలకమైన ప్రైవేటు మైన్ ప్రారంభానికి సిద్ధమైంది. రాయలసీమలోని కర్నూలు జిల్లా జొన్నగిరిలో నిర్మించిన గోల్డ్ మైన్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభించనున్నారు. సుమారు 1477 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ గోల్డ్ మైన్ లో దాదాపు 2 కిలోమీటర్ల మేర బంగారు నిక్షేపాలు ఉన్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఏటా వెయ్యి కిలోల బంగారు శుద్ధి చేసేలా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్ అభివృద్ధి చేశారు. దీని రెండో దశ విస్తరణ పనులకు కూడా బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఈ ప్రాంతం దశ, దిశ మారనున్నట్లు చెబుతున్నారు. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్ తో రాయలసీమ ముఖచిత్రం మారనుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఒకప్పుడు కరువు, కాటకాలతో వెనుకబడిన ప్రాంతంగా ముద్రపడిన రాయలసీమ ఇప్పుడు పరిశ్రమల రాకతో అభివృద్ధిలో దూసుకుపోతోందని అంటున్నారు. బ్రిటిష్ కాలం నాటి కోలార్ గోల్డ్ ఫీల్స్ (ఖ+ఫీ) తర్వాత, బంగారం తవ్వకాలకు జొన్నగిరి ప్రాంతం కేంద్రబిందువుగా మారడం విశేషంగా చెబుతున్నారు. జియోమైసూర్ సర్వీసెస్ ఇండియా సంస్థ చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు, కేవలం వ్యాపార కోణంలోనే కాకుండా వ్యూహాత్మక ప్రాముఖ్యతను సంతరించుకుంది. దాదాపు 1,477 ఎకరాల విస్తీర్ణంలో, అత్యాధునిక ఓపెన్ కాస్ట్, 'అండర్ గ్రౌండ్ మైనింగ్ పద్ధతుల ద్వారా బంగారం వెలికితీసేలా ప్రణాళికలు రూపొందించారు. భూమి లోపల 2 కిలోమీటర్ల లోతు వరకు విస్తరించిన బంగారు నిక్షేపాలు ఉన్నట్లు శాస్త్రీయంగా గుర్తించడం ఈ ప్రాజెక్టుకున్న ప్రత్యేకత.



**రూ.320 కోట్ల పెట్టుబడి**

రూ.320 కోట్లతో ఈ ప్లాంట్‌ను నిర్మించారు. బుధవారం ప్రారంభం కానున్న మొదటి యూనిట్ ద్వారా ఏటా 1,000 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది దేశీయ బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల జొన్నగిరి, పగిడిరాయి, ఎర్రగుడి గ్రామాల్లోని స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కేవలం మైనింగ్ పనులే కాకుండా, గని నిర్వహణ, రవాణా, అనుబంధ రంగాల్లో వందలాది మందికి ఉపాధి దక్కనుంది. గనుల తవ్వకాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, ఆసుపత్రుల ఆధునికీకరణ వంటి సామాజిక బాధ్యతలను కూడా ఈ సంస్థ నెరవేరుస్తోంది.

**రాయలసీమ అభివృద్ధికి ఊతం..**

గతంలో రత్నాలు, వజ్రాలకు పెట్టింది పేరైన రాయలసీమకు, ఇప్పుడు బంగారం తోడవ్వడం ఆ ప్రాంత ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ బంగారు గని కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు, రాయలసీమ ప్రాంత పారిశ్రామికీకరణకు ఒక చోదక శక్తి. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే, మరిన్ని మైనింగ్ సంస్థలు ఈ ప్రాంతం వైపు చూసే అవకాశం ఉంది. ఏపీని ఆకర్షణీయమైన పారిశ్రామిక హబ్‌గా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యానికి జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్ ఒక బలమైన పునాదిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. కర్నూలు జిల్లా కేంద్రంగా మొదలైన ఈ 'బంగారు విప్లవం', యావత్ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందనే ఆశాభావం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

### ఆటలు శారీరక ఆరోగ్యంతో పాటు

# మానసిక ఉత్సాహాన్నిస్తాయి

**శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ - ఘనంగా ప్రపంచ ఒలింపిక్ డే!**
**2026 ఒలింపిక్ నినాదం "యు కెన్ డూ థిస్ - లెట్ అస్ మూవ్"**






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆటల వల్ల శారీరక వ్యాయామం, తద్వారా మానసిక ఆరోగ్యాన్ని కూడా ఇస్తాయని శాప్ డైరెక్టర్ పి రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక ఎస్. కె. వి. టి. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్ లో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వి. తిరుపణ్యం అధ్యక్షతన జరిగిన ఒలింపిక్స్ అవగాహన సమావేశంలో ముఖ్య అతిథిగా రవీంద్ర నాథ్ పాల్గొన్నారు. విద్యార్థులు ఆటలు, వ్యాయామాలను ఒక హాబీ గా నిత్యం చెయ్యాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. శాప్ పూర్వపు డైరెక్టర్ యర్ర వేణుగోపాల్ రాయుడు, ఒలింపిక్ పితామహుడు పియరీ డి కౌబర్టిన్, 1894 మొదటగ ఒలింపిక్స్ ను పునఃప్రారంభించి,విశ్వ వ్యా ప్త క్రీడాభివృద్ధి అందించిన సేవలు అసమాన మని నివాళులు అర్పించేరు. విద్యార్థులు క్రమశిక్షణ, కృషి, పట్టుదల, ఉన్నత విలువలతో చదువుతో పాటు ఆటలలో రాణించాలని ఆకాంక్షించారు.ఎర్ర వేణుగోపాల్ రాయుడు, డి ఎస్. డి ఒ. శేషగిరి, సుబ్రహ్మణ్యం, సుంకర నాగేంద్ర కిషోర్, నాగ రాజు, వీర బాబులు ఒలింపిక్ అసోసియేషన్ వ్యవస్థాపకులు "పియర్ డి. కోబర్టిన్" చిత్ర పటానికి కి పూలమాలతో నివాళులు అర్పించారు. ప్రముఖ క్రీడా కారులు సుంకర నాగేంద్ర కిషోర్ పియర్ డి. కోబర్టిన్, జీవిత చరిత్రను వివరిస్తూ, మానవాళికి, విశ్వ శాంతి సంఘీ భావానికి, 1889 లోనే వ్యాయామం యొక్క అవశ్యకతను గుర్తించి, దృఢ సంకల్పం తో విశ్వ శాంతి కి తోడ్పడే , "అంతర్జాతీయ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాంగ్రెస్ ను" నిర్వహించి,సామాజిక, సాంఘిక క్రీడ సంస్కరణ, క్రీడా స్ఫూర్తి ప్రధానగా చిరస్మరణీయుడు అన్నారు. అనంతరం స్థానిక ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్స్ లో "వరల్డ్ ఒలింపిక్ డే" సందర్భంగా, సుంకర భాస్కర రావు క్రీడా పరిశోధనాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో, తూ.గో. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సహాయ,పర్యవేక్షణ లో "ప్రపంచఒలింపిక్ డే" ను ఘనంగానిర్వహించారు. క్రీడా పరిశోధనాభివృద్ధి కేంద్రం డైరెక్టర్, ప్రముఖ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్, కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఎస్. నాగ రాజు, కార్య దర్శి ఎస్ వీర బాబు సారధ్యంలో, ఒలింపిక్ డే టార్చ్ ను, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ( శాప్) ప్రస్తుత డైరెక్టర్ పి. రవీంద్రనాథ్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ శేషగిరి, అర్బన్ ఎమ్ ఈ వో ఎమ్ వి ఎమ్ సుబ్రహ్మణ్యం, సీరా గంగాధర్ తదితరుల సమక్షంలోఒలింపిక్ రన్ ప్రారంభించారు.. దాదాపు 250 మంది ,క్రీడా కారులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్న ఈ రన్ వై. జంక్షన్ మీదుగా ఎస్. కె. వి. టి. గవర్నమెంట్ కళాశాల వరకు క్రీడా వేడుక వాతావరణంలో స్ఫూర్తి దాయకం గా నిర్వహించబడింది. గత 34 సం. లుగా విశిష్ట క్రీడాభి వృద్ధి సేవలందిస్తున్న ప్రముఖ క్రీడా కారులు, ఎస్. కె. వి.టి.వ్యాయామ అధ్యాపకులు పి. ఎ. కిషోర్ బాబు కి , ప్రత్యేక ప్రశంస, పురస్కారాన్ని ప్రిన్సిపాల్, అతిథుల చేతులు మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాయామ కార్య వర్గ సభ్యులు వి. శ్రీనివాస్, ఏ. డి. ప్రసాద్, ఏ. వి. డి. ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు రవి ప్రకాష్, విజయ కుమార్, రాజేంద్ర కుమార్, విక్టర్, ఉమా, కబాడీ అసోసియేషన్ బురిడీ త్రిమూర్తులు, కోచ్ లు నాగేంద్ర,ఎస్.నాగ రాజు క్రీడా కారులు పాల్గొన్నారు. కార్యదర్శి ఎస్.వీరబాబు వందన సమర్పణ చేశారు.

### హామీల అమలును ప్రశ్నిస్తున్న

## వారిపై అక్రమ అరెస్టులా..?

**కూటమి ప్రభుత్వంపై వైసీపీ బీసీ,ఎస్సీ, మైనారిటీ నేతల విమర్శలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, హామీల అమలును ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ అరెస్టులు, అణిచివేత చర్యలు చేపడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ, ఎస్సీ, మైనారిటీ విభాగాల నాయకులు ఆరోపించారు. మంగళవారం రాజమహేంద్రవరం వీఎల్పురంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీసీ నాయకుడు మార్గాని సురేష్ మాట్లాడుతూ వైసీపీ బీసీ నాయకుడు పీతా రామకృష్ణను పీడీ చట్టం కింద అరెస్ట్ చేయడం అన్యాయమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నించే హక్కును హరించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నగర మైనారిటీ నాయకుడు కరీం ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన రాజకీయ సంస్కృతి కాదన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి కక్షసాధింపు రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. పార్టీ నాయకురాలు అనంతలక్ష్మి మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను భయపెట్టే ఉద్దేశంతో ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన ప్రభుత్వం ప్రతిపక్ష స్వరాలను అణిచివేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. నగర మైనారిటీ సెల్ అధ్యక్షుడు అరిపుల్లా ఖాన్ మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీల అమలులో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. పీతా రామకృష్ణ అరెస్టు కూడా అదే కుట్రలో భాగమని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని, ప్రస్తుతం కక్షసాధింపు రాజకీయాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో బీసీ, ఎస్సీ, మైనారిటీ, మహిళా విభాగాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) నిడదవోలు మండలం ఆధ్వర్యంలో మంగళవారం నిడదవోలు సత్య సాయి ఫంక్షన్ హాల్లో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు మండల అధ్యక్షులు పోతుల సత్య వరప్రసాద్ అధ్యక్షతన జరిగింది.ఈ సదస్సులో రాజమండ్రి అభయ ఎమర్జెన్సీ హాస్పిటల్స్ కు చెందిన ఊపిరితిత్తులు వైద్య నిపుణులు డాక్టర్ ఆర్ కృష్ణ భరద్వాజ్ హాజరై మాట్లాడుతూ ఊపిరితిత్తులకు సంబంధించిన సీఓపీడీ,బ్రాంఖైటీస్,ఆస్తమా, న్యుమోనియా వంటి వ్యాధులను ఏవిధంగా గుర్తించాలి ఏవిధమైన ప్రాథమిక వైద్యం అందించాలో తెలిపారు.శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది,ఆయాసం,ఛాతీ నొప్పి,దీర్ఘకాలికంగా తగ్గని దగ్గు,దగ్గులో రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తే పల్మనాలజిస్ట్ సలహాతో వైద్య సేవలందించాలని అన్నారు.డాక్టర్ ఆర్ ప్రసన్న మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఇబ్బందులు పడే స్పాండిలైటిస్ గురించి, పెయిన్ మేనేజ్మెంట్ లో పీఎంపీలు చేయు చికిత్సల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.దేవానందం,మండల కార్యదర్శి పీవీవీ సత్యనారాయణ,మండల కోశాధికారి నైదాని పండు,సీహెచ్ సత్యనారాయణమూర్తి, వీరబాబు, వెంకట్రావు, సునీల్, సూర్యకుమారి,శివ సీతిరాములు, సుభాష్, చంద్రబోస్, శంకరం,రవి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతోందని ఎమ్మార్వోకు ఫిర్యాదు




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలంలో కొనసాగుతున్న ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియలో ఓటర్ల వ్యక్తిగత వివరాల గోప్యతకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాయవరం మండల శాఖ కార్యకర్తలు మంగళవారం తహశీల్దార్కు ఫిర్యాదు చేసారు. మంథఓటర్ల ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ వంటి వ్యక్తిగత వివరాలను ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ లో భాగంగా బీఎల్ఓలకు అందజేస్తుండగా, అక్కడే ఉన్న ఇతర పార్టీల బీఎల్ఏలు వాటిని మొబైల్ ఫోన్లలో ఆ వివరాలను చిత్రీకరించి అనధికారిక యాప్లలో అప్లోడ్ చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఇది ఓటర్ల గోప్యతా హక్కుకు భంగం కలిగించడమే కాకుండా డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్కు విరుద్ధమని పేర్కొన్నారు. ఓటర్ల వివరాల సేకరణ బాధ్యత కేవలం అధికారులకే ఉండాలని, సేకరించిన పత్రాలను భద్రంగా ఉంచాలని, అనధికారిక వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు శాఖ దుర్గా శ్రీనివాస్, సీనియర్ నాయకులు చిరట్ల సుబ్బారావు, యువమోర్చా నాయకులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ నిధులను ఏఏ పనులకు

## ఎంత ఖర్చు చేయాలో అవగాహన

**ఎంపీడీవో బత్తిన**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయితీలకు ఇస్తున్న నిధులకు ముందస్తు ప్రణాళిక తయారు చేసుకొని ఏఏ పనులకు ఎంత ఖర్చు చేయాలో ప్రత్యేక అధికారులకు కార్యదర్శులకు డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి నిధులను ఏఏ పనులు నిమిత్తం ఎంతశాతం ఖర్చు చేయాలో అవగాహన కల్పిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుండి వస్తున్న నిధులు, గ్రామ పంచాయతీల సొంత నిధులు ఏ విధంగా ఖర్చుచేయాలో ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకుని ఆన్లైన్లో అప్లోడ్ చేయడంపై అవగాహన చేశారు.గ్రామ పంచాయతీకి జమకాబడిన నిధులు మొత్తంలో గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలకు 30శాతం, పారిశుధ్య నిర్వహణకు15శాతం,నీటి సరఫరాకు 15 శాతం,వీధిలైట్లు నిర్వహణకు 15శాతం, గ్రామపంచాయతీ నిర్వహణకు 5శాతం, వివిధ అభివృద్ధి పనులకు 10 శాతం, ఇతర శాఖల నిర్వహణకు 10శాతం నిధులు కేటాయింపు పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో AO సతీష్, మండల ప్రజా పరిషత్ సిబ్బంది, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు,డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ ఆపరేటర్లు, డ్వాక్రా సంఘాల సభ్యులు తదితరు పాల్గొన్నారు.

### వైభవంగా శ్రీ భూసమేత వెంకటేశ్వరస్వామి

## 15వ వార్షిక కళ్యాణ మహోత్సవం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కొలువైయున్న శ్రీ భూసమేత వెంకటేశ్వరస్వామి 15వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఆలయకమిటీ ఆధ్వర్యంలో అంగ రంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఈ కార్యక్రమాల్లో భాగంగా వేద పండితుల ఆధ్వర్యం లో హోమాలు నిర్వహించారు. సోమవారం దివ్య కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా 108 కలశాలతో స్వామిఅమ్మవార్లకు పంచామృత అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి వేదపండితుల ఆధ్వర్యంలో భాజా భజంతులు అశేష భక్తజన గోవింద నామస్మరణతో స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించిన అశేష భక్తజనం భక్తిపార్వశంతో మునిగి తేలారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనను ప్రోత్సాహించండి

**కమిషనర్ రాహుల్ మీనా**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాల స్థాయి నుండి విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారిలో ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించాలని కమిషనర్ రాహుల్ మీనా ఉపాధ్యాయులను కోరారు. స్థానిక వంకాయల వారి వీధిలోని సిటీ మున్సిపల్ కార్పొరేషన్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శామ్యూల్ ప్రవీణ్ ప్రతినెలా రూపొందిస్తున్న "సీఎంహెచ్ టైమ్స్" పాఠశాల మాసపత్రిక జూన్ నెల సంచికను కమిషనర్ తన ఛాంబర్లో మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. శామ్యూల్ ప్రవీణ్ భావ వ్యక్తీకరణ, ఆధునిక టెక్నాలజీ పట్ల ఉన్న ఆసక్తి, అతని ప్రతిభను అభినందించారు. శామ్యూల్ ప్రవీణ్ స్పెల్ బి పోటీలలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించాడని ప్రధానోపాధ్యాయులు పి.దుర్గా ప్రసాద్, కమిషనర్కు వివరించారు.

## స్ఫూర్తినిచ్చిన మంగారాణి వితరణ



**కందికొండ రమేష్ - సత్యచైత్రకు మరో పదివేలు**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక లాలా చెరువు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న మంగారాణి ఆ పాఠశాల లో చదువుతూ, పది పరీక్షల్లో 535 మార్కులు సాధించిన లక్కోజు సత్య చైత్ర ఉన్నత చదువుల నిమిత్తం సోమవారం 25వేల రూపాయలు అందచేసిన సంగతి విదితమే.ఆ స్ఫూర్తి తో నేస్తం ఫౌండేషన్ వారు ఈరోజు మరో పదివేలరూపాయలు సత్యచైత్ర వ్యక్తిగత ఖాతాలో జమ చేసినట్టు పాఠశాల ఎస్ ఎమ్ సి చైర్మన్ కందికొండ రమేష్ తెలిపారు. మంగారాణి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని, తన ఎ ఐ పాఠాల ద్వారా లభించిన గౌరవ వేతనాన్ని నిరుపేద చైత్ర ఉన్నత చదువులకు ఇవ్వడం ఎందరికో స్ఫూర్తినిస్తుందన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కమిషనర్ రాహుల్ మీనా లు.. పది ఫలితాల్లో మంచి మార్కులు వచ్చిన విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీ లలో ఫీజులో రాయితీ ఇప్పించారని, మంగా రాణి ద్వారా సమకూరిన ఈ 35 వేల రూపాయలతో తన కుమార్తె రెండు సంవత్సరాల ఇంటర్ చదువు పూర్తి అవుతుందని సత్య చైత్ర తల్లి అనందం వ్యక్తం చేశారు. మంగారాణి వితరణ, పేద విద్యార్థిని చదువుకు సాయం చెయ్యాలన్న తపనను జిల్లా విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు, అర్బన్ ఎమ్ఈవో ఎమ్వివిఎమ్ సుబ్రహ్మణ్యం అభినందించారు.

## మలేరియా అవగాహన కార్యక్రమం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మలేరియా అవగాహన మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు నాయకత్వంలో మలేరియా, ఇతర వాహకజనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య విద్యార్థుల్లో అవగాహన పెంపొందించి, వారు ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కల్పించే రాయబారులుగా పనిచేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో జరిగింది.కార్యక్రమానికి ప్రారంభంగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. వి.వి. దుర్గాప్రసాద్ ప్రారంభోపన్యాసం చేశారు. మలేరియా నివారణ, వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం, సమాజ భాగస్వామ్యంతో మలేరియా నిర్మూలన లక్ష్యాన్ని సాధించవచ్చని ఆయన వివరించారు.అనంతరం కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ మలేరియాను నిర్మూలించాలంటే దోమలు పుట్టకుండా, కుట్టకుండా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు.కళాశాల ప్రిన్సిపాల్, అదనపు వైద్య విద్యా సంచాలకులు (ఎడిఎంఇ) డా.ఎం.ఎస్..రాజు మలేరియా, ఇతర వాహకజనిత వ్యాధులపై సమగ్ర అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ, చికున్గున్యా తదితర వ్యాధుల వ్యాప్తి విధానాలు, లక్షణాలు, చికిత్సా పద్ధతులు మరియు నివారణ చర్యలను వివరించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల పెంపక కేంద్రాల నిర్మూలన, దోమతెరల వినియోగం, వ్యక్తిగత రక్షణ చర్యల ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. వైద్యవిద్యార్థులు మలేరియా నిర్మూలనలో ప్రతిఒక్కరు భాగస్వామ్యులు అవ్వాలని పిలుపునిచ్చారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. కె.శివ ప్రసాద్ మాట్లాడుతూ మలేరియాను అరికట్టాలంటే నివారణ చర్యలు ప్రతిఒక్కరూ తీసుకోవాలని, డ్రై డే ఆవశ్యకతను తెలియజేశారు.అవగాహన కార్యక్రమంలో భాగంగా వైద్య విద్యార్థులు దోమల జీవన చక్రం, మలేరియా వ్యాప్తి విధానం, వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, సకాలంలో చికిత్స అవసరాన్ని ప్రతిబింబించే పోస్టర్లను ప్రదర్శించారు. విద్యార్థుల పోస్టర్ ప్రదర్శనలు ప్రజారోగ్య సందేశాలను సమర్థవంతంగా చాటిచెప్పాయి. మలేరియా నివారణ బృహత్తర కార్యక్రమములో ప్రతిఒక్కరూ తమవంతు కృషిచేస్తామని అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధ్యాపకులు డా.వి. సూర్యారావు,అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.దీప్తి, డా.ప్రశాంతి, సీనియర్ రెసిడెంట్ డా భరత్ రాజ్,సామాజిక శాస్త్ర ఉపన్యాసకులు మూర్తి, ప్రసన్న, శాస్త్రి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ విజయ్,ఇతర విభాగాల అధ్యాపకులు, సిబ్బంది,వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## నగరంలో సూపర్ స్టార్ కృష్ణ విగ్రహం ఏర్పాటు చేయాలి

**మహేష్ బాబు అభిమానులు సేవా కార్యక్రమాలు విస్తరించాలి**

**కృష్ణ-మహేష్ బాబు సేవా సమితి సలహాదారు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు పిలుపు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగరంలో దివంగత సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కృష్ణ-మహేష్ బాబు సేవా సమితి కోరింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో తీర్మానం చేశారు. ప్రముఖ సామాజిక సేవకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సూపర్ స్టార్ కృష్ణ సీనియర్ అభిమానులు, విద్యావేత్తలు పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, ఎం. నరసింహారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేఎన్వీ తనుజ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా గుబ్బల రాంబాబు మాట్లాడుతూ **Mahesh Babu** అభిమానులు సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని, అందరూ ఏకతాటిపైకి వచ్చి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అభిమానుల మధ్య ఐక్యత పెంపొందించేందుకు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అభిమానుల సంక్షేమం కోసం అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. అలాగే నగరంలో సూపర్ స్టార్ కృష్ణ విగ్రహం ఏర్పాటు అంశాన్ని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా త్వరలో విడుదల కానున్న శ్రీనివాస మంగాపురం చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఘట్టమనేని జయకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులుగా కిరణ్, మహేష్లను సమావేశానికి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప, చిన్ని, వెంకట్, ప్రసాద్, శ్రీను తదితర అభిమానులు పాల్గొన్నారు.




# నా కూతురు ఏయ్ పెద్ది అని పిలుస్తోంది..

**ఈ విజయం నా జీవితాన్నే మార్చేసింది.. రామ్ చరణ్ ఎమోషనల్..**



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ మూవీ ఇప్పటికే 400 కోట్లకు పైగా రాబట్టి ఇప్పటికీ థియేటర్లలో దూసుకుపోతుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమా మెగా ఈవెంట్ నిర్వహించింది చిత్రయూనిట్. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి, సుకుమార్, అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా విచ్చేశారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఇటీవల విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలై రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతున్న ఈ చిత్రం విజయానందాన్ని పంచుకోవడానికి చిత్రబృందం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో 'మెగా బ్లాక్‌బస్టర్ ఈవెంట్' పేరిట ఘనంగా విజయోత్సవ సభను నిర్వహించింది. ఈ అట్టహాసమైన వేడుకకు టాలీవుడ్ దిగ్గజం, మెగాస్టార్ చిరంజీవి , ప్రముఖ దర్శకుడు సుకుమార్, డైరెక్టర్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. మెగాస్టార్ రాకతో శిల్పకళావేదిక ప్రాంగణం అభిమానుల కోలాహలంతో, నినాదాలతో మారుమోగి పోయింది. ఈ సందర్భంగా మాట్లాడిన రామ్ చరణ్.. పెద్ది సినిమా సక్సెస్ చేసినందుకు ప్రేక్షకులకు చిత్రయూనిట్ కు ధన్యవాదాలు తెలిపారు. పెద్ది తన జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని రామ్ చరణ్ పేర్కొన్నారు. "కొన్ని విజయాలు ఆనందపరుస్తాయి, కొన్ని తృప్తినిస్తాయి. కానీ ఈ విజయం అసలు నా లైఫ్‌నే మార్చేసింది," అని ఆయన అన్నారు. తాను నటించిన ఇంతకు ముందు సినిమాలకు వచ్చిన అభిమానం ఒకట్రైతే, పెద్దికి వచ్చిన స్పందన ఒక కొత్త అనుభూతిని అందించిందని, ఇది తన గుండెల్లోతులకు వెళ్లిందని వివరించారు. థియేటర్లకు వచ్చిన కొత్త ప్రేక్షకులు, చిన్న పిల్లలు, వృద్ధులు కూడా పెద్దిని ఆస్వాదిస్తున్న తీరు తనను ఎంతగానో సంతోషపరిచిందన్నారు. "మళ్ళీ ఇలాంటి అనుభూతి వస్తుందో లేదో తెలియదు," అని ఆయన అన్నారు. ఈ చిత్రం తన వ్యక్తిగత జీవితంపై చూపిన ప్రభావాన్ని తన కుమార్తె క్లీం కారా ఉదాహరణతో పంచుకున్నారు. "రామ్ చరణ్ ని మర్చిపోయి మీరు పెద్దిని గుర్తుపెట్టుకుంటారేమో భయమేస్తుంది. నా బుడ్డది క్లీంకార.. పెద్ది రిలీజ్ అయ్యేవరకు నానా నానా అనేది, ఇప్పుడు ఏయ్ పెద్ది అంటుంది. ఏయ్ అలా పిలవకే నాన్నని అంటే ఏయ్ పెద్ది నానా అంటుంది," అని నవ్వుతూ చెప్పారు. తన పేరు, నానా అనే పిలుపు మర్చిపోయి పెద్దిని గుర్తుపెట్టుకునేలా చేసిన దర్శకుడు బుచ్చి బాబు సానకు రామ్ చరణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దర్శకుడు బుచ్చి బాబు సానను తనకు పరిచయం చేసిన సుకుమార్‌కు రామ్ చరణ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సుకుమార్‌ను తన మోస్ట్ ఫేవరెట్ హ్యూమన్ బీయింగ్, మోస్ట్ ఫేవరెట్ పర్సన్, అలాగే తనకు పెద్ద అన్నయ్య లాంటి వ్యక్తి అని అన్నారు.. తన నిర్మాత వెంకట సతీష్ కిలారుకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తొలి సినిమా నిర్మాతలా కాకుండా, ఎన్నో సినిమాలు నిర్మించినంత అనుభవంతో బలమైన స్తంభంలా నిలిచారని ప్రశంసించారు. సినిమాటోగ్రాఫర్ రత్నవేలు నాలుగు సినిమాలకు పనిచేశారని, పెద్దిని అత్యద్భుతంగా తెరకెక్కించారని కొనియాడారు. కుస్తీ షాట్స్, ఢిల్లీ ఎపిసోడ్ తనకు ఇష్టమని, ఆయన సినిమాటోగ్రఫీ ఒక మాస్టర్‌పీస్ అని అన్నారు. సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ గారికి పెద్ద ఎత్తున చప్పట్లు కొట్టాలని కోరుతూ, సెకండ్ హాఫ్‌కు ఆయన అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రాణం పోసిందని, జనాల్లోకి తీసుకెళ్లిందని ప్రశంసించారు. అలాగే ఎడిటర్ నవీన్ నూలి, లిరిసిస్ట్, డైరెక్షన్, సినిమాటోగ్రఫీ, లైటింగ్, ఆర్ట్ డిపార్ట్‌మెంట్లకు (అవినాష్ కొల్ల) ధన్యవాదాలు తెలిపారు. అవినాష్ కొల్ల పెద్ది ప్రపంచాన్ని అద్భుతంగా సృష్టించారని అన్నారు. తెలుగు ప్రజలు ఎవరినీ అంత ఈజీగా ఇష్టపడరని, ఒక్కసారి ఇష్టపడితే చనిపోయే వరకు గుర్తుపెట్టుకుంటారని, ప్రేమిస్తూ ఉంటారని ఠాగూర్ సినిమాలోని డైలాగ్‌ను రామ్ చరణ్ గుర్తు చేసుకున్నారు. పెద్ది తమ సినిమా కాదని, నిజమైన ప్రేక్షక దేవుళ్ల సినిమా అని అన్నారు.. సినిమా చూసిన ప్రతి ఒక్కరికీ, రివ్యూలు ఇచ్చిన ప్రతి రివ్యూయర్‌కు సెల్యూట్ చేశారు. ఒక మంచి సినిమా అంటే నటీనటులు, దర్శకులు, రివ్యూయర్స్, అభిమానులకు మించి వెళ్తుందని, పెద్దితో ప్రేక్షకులు అదే నిరూపించారని పేర్కొన్నారు. అలాగే రెండు రాష్ట్రాల మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ (డిప్యూటీ సీఎం), దుర్గేశ్ లకు ధన్యవాదాలు తెలిపారు. జాన్వీ కపూర్, హలో హలో పాట పాడిన శృతి హాసన్, సహ నిర్మాత ఈషాన్, ఇతర నటీనటులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సినిమా కథ విన్నప్పుడు తాను పెద్ద ఎక్స్‌పెరిమెంట్ చేస్తానని అనుకోలేదని, కమర్షియల్ సినిమాగానే చేశానని, ఇప్పుడే అది ఎక్స్‌పెరిమెంట్ అని తెలిసిందని సుకుమార్‌ను ఉద్దేశించి అన్నారు.

# తొలి సినిమా బ్లాక్ బస్టర్..

**కట్ చేస్తే కనిపించకుండా పోయిన బ్యూటీ..**

ఈ అమ్మడి బ్యాగ్రౌండ్ మామూల్ది కాదు.. పొలిటికల్ ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ. వరుసగా సినిమాలు చేసింది ఈ అందాల తార, తెలుగుతో పాటు హిందీలోనూ సినిమాలు చేసి మెప్పించింది. కానీ ఇప్పటివరకు కేవలం ఒక్క హిట్టు మాత్రమే అందుకుంది. ఈ అమ్మడి బ్యాగ్రౌండ్ మామూల్ది కాదు.. పొలిటికల్ ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ. వరుసగా సినిమాలు చేసింది ఈ అందాల తార, తెలుగుతో పాటు హిందీలోనూ సినిమాలు చేసి మెప్పించింది. కానీ ఇప్పటివరకు కేవలం ఒక్క హిట్టు మాత్రమే అందుకుంది. అందం, అభినయంతో మంచి మార్కులే కొట్టేసింది. కానీ అవకాశాలకు మాత్రం ఆమడ దూరంలోనే ఉండిపోయింది. ఇప్పటికే ఇండస్ట్రీలో చాలా మంది స్టార్ కిడ్స్ ఉన్నారు. సినిమా బ్యాగ్రౌండ్ నుంచి వచ్చి స్టార్ అయ్యారు. కానీ ఈ ముద్దుగుమ్మ ఏకంగా ఎమ్మెల్యే కూతురు. భూమి పెడ్నేకర్, ఆయుష్ శర్మ, అరుణోదయ్ సింగ్ వంటి నటులు తమ కుటుంబ వారసత్వాన్ని వదిలి సినిమా పరిశ్రమకు వచ్చారు. సినిమాలు చేసి తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరిలో కొందరు మాత్రమే సినిమాల్లో విజయం సాధించగలిగారు. కానీ మనం ఇప్పుడు మాట్లాడుకోబోయే నటి మాత్రం ఇండస్ట్రీలో స్టార్స్ అందరితో కలిసి పనిచేసింది. అనేక సినిమాల్లో నటించి మెప్పించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అంతే కాదు ఇండస్ట్రీలో హాట్ బాంబ్ గా పేరు తెచ్చుకుంది. ఆమె మరెవరో కాదు.. నేహా శర్మ 2007లో చిరుత సినిమాతో సినీప్రయాణం స్టార్ట్ చేసింది నేహా శర్మ. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది ఈ తార. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన చిరుత మూవీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆ తర్వాత 2009లో వరుణ్ సందేశ్ నటించిన కుర్రాడు అనే సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చింది. కానీ ఈ సినిమా పెద్దగా ఆడలేదు. 2010లో హిందీ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఈ బ్యూటీ రామ్ చరణ్, ఇమ్రాన్ హష్మీ వంటి స్టార్ హీరోలకు జోడిగా కనిపించింది. 2010లో వచ్చిన 'క్రూక్' చిత్రం సూపర్ హిట్ అయ్యింది. ఈ సినిమా తర్వాత నేహా శర్మకు చాలా సినిమా ఆఫర్లు రావడం ప్రారంభించాయి. కానీ 16 ఏళ్ల సినీప్రయాణంలో నేహా ఖాతాలో కేవలం ఒక్క హిట్టు మాత్రమే పడింది. నేహా తండ్రి అజిత్ శర్మ, బీహార్ శాసనసభలో భాగల్పూర్ నియోజకవర్గం నుంచి అనేకసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే. నటి నేహా శర్మ 2020 నుండి చిత్ర పరిశ్రమకు దూరంగా ఉంది. కానీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది.



# టీజీ20 లీగ్.. పాలమూరుపై హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ ఘన విజయం

టీజీ20 లీగ్ 2026లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ ఆరంభం అదిరిపోయింది. పాలమూరు స్ట్రైకర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బంతితో చెలరేగి ప్రత్యర్థి జట్టును 141 పరుగులకే కట్టడి చేసిన ఈ ఛాంపియన్స్.. లక్ష్యాన్ని 15.4 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ అభిరథ్ రెడ్డి (35; 13 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు ఆరంభం ఇవ్వగా.. అన్విత్ రెడ్డి (53బి; 42 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), గడుగు గణేశ్ (50బి; 30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) జట్టును విజయతీరాలకు చేర్చారు. అన్విత్ రెడ్డి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తొలుత పాలమూరు స్ట్రైకర్స్ 19.4 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. రోహిత్ రాయుడు (35; 22 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. ప్రతీక్ పవార్ (30), విఘ్నేశ్ రెడ్డి (30) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే పరిమితమయ్యారు. హైదరాబాద్ బౌలర్లలో అజయ్‌దేవ్ గౌడ్ (4/21) అదరగొట్టాడు. యశ్వీర్ గౌడ్ (2/15), ప్రణవ్ వర్మ (2/25) కూడా మెరిశారు. శ్రీనికేత్ ఒక వికెట్ పడగొట్టాడు. పాలమూరు నిర్దేశించిన 142 పరుగుల లక్ష్యఛేదనలో హైదరాబాద్ విజయం దిశగా సాగుతోంది. గత రెండు ఓవర్లలో హైదరాబాద్ బ్యాటర్లు 19 పరుగులు రాబట్టారు. రవి కిరణ్ వేసిన 13 ఓవర్లో గణేశ్ బ్యాట్ నుంచి రెండు ఫోర్లు వచ్చాయి. 13 ఓవర్లకు 'ఈ' ఛాంపియన్స్ స్కోరు 114/3. గణేశ్ (32), అన్విత్ (42) పరుగులతో ఉన్నారు. పాలమూరుతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ బ్యాటర్లు నిలకడగా ఆడుతున్నారు. నిశాంత్ రెడ్డి వేసిన 11 ఓవర్లో అన్విత్ రెండు ఫోర్లు, గణేశ్ ఒక ఫోర్, సిక్స్ బాదేశారు. ఈ ఓవర్‌లో మొత్తం 22 పరుగులు వచ్చాయి. 11 ఓవర్లకు హైదరాబాద్ స్కోరు 95/3. గణేశ్ (18), అన్విత్ రెడ్డి (37) పరుగులతో ఉన్నారు. హైదరాబాద్ లక్ష్యం 142. పాలమూరుతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ 10 ఓవర్లు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. గత నాలుగు ఓవర్లలో 18 పరుగులు వచ్చాయి. గణేశ్ (6), అన్విత్ రెడ్డి (28) క్రీజులో ఉన్నారు. హైదరాబాద్ టార్గెట్ 142. 142 పరుగుల లక్ష్యఛేదనలో హైదరాబాద్ మూడో వికెట్ కోల్పోయింది. యశ్వీర్ గౌడ్ (3) ఔటయ్యాడు. రవి కిరణ్ బౌలింగ్‌లో (5.4 ఓవర్) వికెట్‌కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. అంతకముందు నిపుణ్ రెడ్డి వేసిన ఐదో ఓవర్‌లో అన్విత్ రెడ్డి వరుసగా 6, 4 బాదాడు. పవర్ ప్లే ముగిసేసరికి హైదరాబాద్ స్కోరు 55/3. గణేశ్ (0), అన్విత్ రెడ్డి (16) క్రీజులో ఉన్నారు. టీజీ20 లీగ్ 2026లో భాగంగా పాలమూరు స్ట్రైకర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ లక్ష్యఛేదనకు దిగింది. రవి కిరణ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో 8 పరుగులు వచ్చాయి. రిషభ్ బస్లాస్ వేసిన రెండో ఓవర్‌లో సాయి వికాస్ రెడ్డి (1).. బౌలర్‌కే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. పార్థిపన్ వేసిన మూడో ఓవర్‌లో హైదరాబాద్ కెప్టెన్ అభిరథ్ రెడ్డి మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదేసి 24 పరుగులు రాబట్టాడు. తర్వాత రిషభ్ బస్లాస్ బౌలింగ్‌లో అభిరథ్ (35; 13 బంతుల్లో).. రోహిత్ రాయుడుకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 4 ఓవర్లకు హైదరాబాద్ స్కోరు 38/2. యశ్వీర్ (1), అన్విత్ (1) క్రీజులో ఉన్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన పాలమూరు 19.4 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.




# నితీశ్ రెడ్డి ఔట్.. సూర్యాంశ్‌కు ఛాన్స్



ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్‌లకు టీమ్ఇండియా సిద్ధమవుతోన్న వేళ ఆటగాళ్ల గాయాల బెడద జట్టును వెంటాడుతోంది. ఇప్పటికే మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి టీ20 జట్టు నుంచి వైదొలగగా.. తాజాగా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా దూరమయ్యాడు. తొడ కండరాల గాయం కారణంగా ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌కు అతడు అందుబాటులో ఉండడని బీసీసీఐ వెల్లడించింది. అతడి స్థానంలో సూర్యాంశ్ షెడ్గెను జట్టులోకి తీసుకుంది. ఈ మేరకు తాజాగా ప్రకటన విడుదల చేసింది. అఫ్గాన్‌తో వన్డే సిరీస్ ఆడుతుండగా నితీశ్ గాయపడిన సంగతి తెలిసిందే. తొలుత చిన్న దెబ్బే అనిపించినా.. ఎమ్మారైలో తొడ కండరాలకు గాయమైనట్లు తెలిసింది. అతడు కోలుకునేందుకు కనీసం నాలుగు వారాల సమయం పడుతుందని వైద్యులు వెల్లడించారు. ఆ తర్వాత కూడా ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు మరికొంత సమయం అవసరం. దీంతో ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్‌లకు బీసీసీఐ అతడిని జట్టు నుంచి తొలగించింది. నితీశ్ వైదొలగడంతో యువ ఆటగాడు సూర్యాంశ్‌కు ఛాన్స్ లభించింది. ఇటీవల శ్రీలంక-ఎ జట్టుతో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో ఇతడు నిలకడైన ప్రదర్శన చేశాడు. ఈ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ ఐదు మ్యాచ్‌ల్లో 147 పరుగులు సాధించాడు. బంతితోనూ రాణించాడు. 2024-25లో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబయి తరఫున 131 పరుగులు చేసి బీసీసీఐ సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. జూన్ 26-28 మధ్య ఐర్లాండ్‌తో టీమ్ఇండియా రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత జులై 1 - 11 మధ్య ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్ జరగనుంది.

# టీజీ20 లీగ్.. రంగారెడ్డి రైజర్స్ విజయం



టీజీ20 లీగ్‌లో భాగంగా మెదక్ ఫాల్కన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రంగారెడ్డి రైజర్స్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. 165 పరుగుల లక్ష్యాన్ని 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రాకేశ్ (38బి; 34 బంతుల్లో) టాప్ స్కోరర్. నితిన్ (28బి), ఆరోన్ జార్జ్ (27), అవనీశ్ (25), తనయ్ త్యాగరాజన్ (21) పరుగులు చేశారు. మెదక్ బౌలర్లలో వరుణ్ రెండు వికెట్లు, తేజ, ఘాజీ, అభ్యానన్ చెరో వికెట్ తీశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన మెదక్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. ఐదో స్థానంలో వచ్చిన విక్రమ్ నాయక్ (49; 38 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) త్రుటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఓపెనర్ సాయి పూర్ణానంద్‌రావు (38), నమన్ అగర్వాల్ (37), సూర్యతేజ (10) పరుగులు చేశారు. రంగారెడ్డి బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ 3, కరియప్ప 2, తనయ్ జడ్డూ 2, అరుణ్ కుమార్ ఒక వికెట్ పడగొట్టారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com